RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:21 SATURDAY ,MAY 23,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :21 శనివారం, మే 23, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన - మిగతా2లో

## హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర

### రికార్డు సాధించిన వైద్య బృందానికి సీఎం సెల్యూట్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పునర్జన్మ ప్రసాదిస్తూ తాజాగా 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. నిమ్స్ సాధించిన ఈ అరుదైన మరియు అద్భుతమైన మైలురాయిపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిమ్స్ నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల వైద్యులు, సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందించడంలో నిమ్స్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. తాజా రికార్డుతో దక్షిణ భారతదేశంలోనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో నిమ్స్ నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక దేశ వ్యాప్తంగా చూసుకుంటే నిమ్స్ అత్యున్నతమైన మూడో స్థానంలో నిలిచింది. - మిగతా2లో




## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రిజర్వేషన్ల పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడం పై అభ్యంతరం - మిగతా2లో



## భారత్ ఎన్నటికీ తలవంచదు: అమిత్‌షా

తెలంగాణ పత్రిక ప్రతినిధి

సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందు కోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం నాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, - మిగతా2లో



## డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ 'కుబేర' లీలలు..

### ఏసీబీ సోదాల్లో బయటపడ్డ వందల కోట్ల అక్రమాస్తులు!



తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలో అవినీతి తిమింగలాల పై అవినీతి నిరోధక శాఖ మరోసారి పంజా విసిరింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె.వంశీ మోహన్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు గురువారం (మే 21) తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు, - మిగతా2లో

## తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు..

### 15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేసేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది. మొత్తం 15,982 - మిగతా2లో

## మహిళా సంఘాలకు రుణాల పై భట్టి విక్రమార్క శుభవార్త



వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న భట్టివిక్రమార్క
సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత
వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు ఇస్తున్నాయని బ్యాంకులకు కితాబు

## ముంచుకొస్తున్న నైరుతి తెలంగాణ ఏపీలో వర్షాలు..

### వాతావరణశాఖ లేటెస్ట్ అప్డేట్ ఇదిగో

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఏపీ, తెలంగాణకు సంబంధించి వాతావరణశాఖ వెదర్ రిపోర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదురుతున్నాయి. దీంతో పాటు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నాయి. రాబోయే మూడ్రోజుల పాటు వర్షాలు పడనున్నాయని శుక్రవారం వాతావరణశాఖ అంచనా వేసింది. - మిగతా2లో



## పదేళ్లు ఏం చేశారని మాట్లాడుతున్నావ్? రేవంత్ జోలికొస్తే ఊరుకోం..

### కేటీఆర్‌కు మంత్రి అడ్లూరి మాస్ వార్నింగ్..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్‌లో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ తన భాషను మార్చుకోకపోతే ఊరుకునేది లేదని గట్టిగా - మిగతా2లో



## హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర

-మొదటిపేజీ తరువాయి

దేశంలో టాప్-3 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆసుపత్రులు, ఐకేడీఆర్‌సీ - గుజరాత్ (తొలి స్థానం), క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ - లూథియానా (రెండో స్థానం), నిమ్స్- హైదరాబాద్ (మూడో స్థానం), కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలతో కూడుకున్న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పేదలకు ఉచితంగా అందించి అండగా నిలిచింది. నిమ్స్‌లో జరిగిన మొత్తం 2,000 కిడ్నీ మార్పిడి చికిత్సల్లో ఏకంగా 95 శాతం శస్త్రచికిత్సలు ఆరోగ్యశ్రీ మరియు సీఎం సహాయనిధి ద్వారా ఉచితంగా జరిగాయి. అంటే దాదాపు 1,900 మంది పేద రోగులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిమ్స్ వైద్యులు ఉచితంగా కిడ్నీ మార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు.గతంలో కంటే నిమ్స్ ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు మెరుగుపడటంతో కిడ్నీ మార్పిడిల వేగం పుంజుకుంది.2023 జనవరి నుంచి ఇప్పటివరకు (గడిచిన 3 ఏళ్ల 4 నెలల కాలంలోనే) రికార్డు స్థాయిలో 500 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేయడం విశేషం. నిరంతరాయంగా, అంకితభావంతో కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిస్తున్న నిమ్స్ వైద్య బృందాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, వైద్య ప్రముఖులు కొనియాడుతున్నారు.

## ధాన్యం కొనుగోలు సమస్యల పై కవిత సచివాలయం ముట్టడి

-మొదటిపేజీ తరువాయి

కొనుగోలు సమస్యల పై ఒకవైపు తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రెస్‌మీట్ కొనసాగుతుండగానే అదే సమస్య పై మరోవైపు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత సచివాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేస్తూ పార్టీ శ్రేణులలో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వెంటనే రంగప్రవేశం చేసిన పోలీసులు ధర్నా చేస్తున్న టీఆర్ఎస్ కార్యకర్తలను వ్యాన్‌లో, కవితను కారులో పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పంట కొనుగోలు లేక రైతులు నానా అవస్థలు పడుతుంటే ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి లేదు అని విమర్శించారు.

**రెండున్న రేళ్లలో వ్యవసాయం పై రేవంత్ రెడ్డిసమీక్ష సైతం చేయలేదు**

రెండున్నరేళ్లలో వ్యవసాయంపై సమీక్ష సైతం చేయలేదని, ధాన్యం, మక్కలు సహా ఏ పంట వేసిన రైతులైన అమ్మకాల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విత్తనాలు, ఎరువులు అందడం లేదని, పంట కొనడం లేదని, రైతు భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. తక్షణమే కల్లాల్లో ఉన్న వడ్లను, అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## మహిళా సంఘాలకు రుణాల పై భట్టివిక్రమార్క శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీ పై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

## ముంచుకొస్తున్న నైరుతి తెలంగాణ ఏపీలో వర్షాలు.. వాతావరణశాఖ లేటెస్ట్ అప్డేట్ ఇదిగో.

-మొదటిపేజీ తరువాయి

ఏపీ, తెలంగాణకు వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. రాబోయే 2-3 రోజులలో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలతో పాటు తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఇక గురువారం తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి ఒడిస్సా కోస్తా తీరం వరకు కొనసాగిన ద్రోణి.. ఈరోజు వాయువ్య ఉత్తరప్రదేశ్ నుండి తూర్పు ఉత్తర ప్రదేశ్ ఛత్తీస్గఢ్ మీదుగా అంతర్గత ఒడిస్సా ప్రాంతంలో కొనసాగుతోంది. సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది.

**తెలంగాణకు కూల్ న్యూస్**

ఇక మధ్య బంగాళాఖాతం, నైరుతి బంగాళాఖాతం మీదుగా తమిళనాడు వరకు కొనసాగిన ద్రోణి ఈరోజు బలహీనపడింది. వీటి ప్రభావంతో ఈరోజు, రేపు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఇక శుక్రవారం తెలంగాణలోని కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావణ కేంద్రం పేర్కొందిఉపరితల ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో నేడు, రేపు పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులకు అవకాశముంది. తీవ్ర వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది . రాత్రిపూట వెచ్చగా ఉండే అవకాశం ఉన్నది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకట లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. దక్షిణ కోస్తా, రాయలసీమలో కూడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గరిష్టంగా గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్ధక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

# భారత్ ఎన్నటికీ తలవంచదు: అమిత్‌షా

-మొదటిపేజీ తరువాయి

అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్‌ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు. పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలను కలుపుకుని కలుపుతూ సెక్యూరిటీ గ్రిడ్ ఏర్పాటు జరుగుతుందని, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం శాఖ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వామపక్ష తీవ్రవాదం నిర్మూలనపై మాట్లాడుతూ, సమస్యను కంట్రోల్ చేయడం కేవలం భద్రతగా చూడరాదని, ఈ బెడదను సమూలంగా పెకిలించాల్సి ఒదేనని అన్నారు. వాపక్ష తీవ్రవాదం ఎలా నిర్మూలించామో అదే రీతిలో చొరబాటుదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రంట్‌లైన్ జవాన్లకు సహకరించేందుకు ఉన్నతస్థాయి డెమోగ్రఫీ మిషన్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. దేశభద్రతకు బీఎస్ఎఫ్ అందిస్తున్న సేలను అమిత్‌షా ప్రశంసించారు. 1965లో బీఎస్ఎఫ్‌ను కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభించగా ఇప్పుడది 2,70,000 మందితో పటిష్టమైన దళంగా ఏర్పడిందని, ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా నిలిచిందని అన్నారు. సరిహద్దుల పటిష్టత విషయంలో బీఎస్ఎఫ్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా శత్రువును చిత్తుచేస్తూ వచ్చారని, దేశం ఎప్పుడూ తలవంచుకునే పరిస్థితి రాలేదని అన్నారు. విధి నిర్వహణలో అసమాన సేవలందించిన బీఎస్ఎఫ్ సిబ్బందిని హోం మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

-మొదటిపేజీ తరువాయి

ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం పై ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు.అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక,ఈ కేసులో సుప్రీంకోర్టు. కేంద్ర ప్రభుత్వానికి,ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ 'కుబేర' లీలలు.. ఏసీబీ సోదాల్లో బయటపడ్డ వందల కోట్ల అక్రమాస్తులు!

-మొదటిపేజీ తరువాయి

నితెలంగాణలో అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ మరోసారి పంజా విసిరింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె. వంశీమోహన్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు గురువారం (మే 21) తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు, వంశీమోహన్‌తో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన మొత్తం 8 ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. తెలంగాణలో అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ మరోసారి పంజా విసిరింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె. వంశీమోహన్ లక్ష్యంగా ఏసీబీ అధికారులు గురువారం (మే 21) తెల్లవారుజాము నుంచే ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు, వంశీమోహన్‌తో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన మొత్తం 8 ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. వంశీ మోహన్ అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురం పరిధిలో సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా కాజేసినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో తేలింది. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి, ఆ తర్వాత దాన్ని ఓ ప్రముఖ రియల్టర్‌కు దారాదత్తం చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనికి ప్రతిఫలంగా సదరు రియల్టర్ నుంచి వంశీ మోహన్ కుటుంబ సభ్యుల పేరిట 10 విలువైన ప్లాట్లను 'గిఫ్ట్ డీడ్' రూపంలో పొందినట్లు ఏసీబీ పక్కా ఆధారాలు సేకరించింది.హైదరాబాద్ మహానగరంతోపాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్‌కు సంబంధించి వందల కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సోదాల్లో భాగంగా భారీగా లభించిన ఆస్తి పత్రాలు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం, నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ, అందుకు ప్రతిఫలంగా కోట్లాది రూపాయల లంచాలు, ప్లాట్లను వెనకేశారనే ఆరోపణలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ సోదాల పర్వం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత గల డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారే ఇలా అక్రమాలకు తెరలేపడంపై ఏసీబీ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది.

## పదేళ్లు ఏం చేశారని మాట్లాడుతున్నావ్? రేవంత్ జోలికొస్తే ఊరుకోం.. కేటీఆర్‌కు మంత్రి అడ్లూరి మాస్ వార్నింగ్..?

-మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ తన భాషను మార్చుకోకపోతే ఊరుకునేది లేదని గట్టిగా హెచ్చరించారు.

**సీఎంను ఏకవచనంతో పిలిస్తే ఊరుకోం**

మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏకవచనంతో సంబోధించడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. 'గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్‌ను ప్రతిపక్ష నేతలు ఎప్పుడైనా ఇంత అవమానకరంగా మాట్లాడారా?' అని ఆయన ప్రశ్నించారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే బీఆర్ఎస్ నేతలు ఆగం అవుతున్నారని ఎద్దేవా చేశారు.

**ముందు మీ కుటుంబ వ్యవహారాలు చక్కదిద్దుకో..**

కేటీఆర్‌కు వేరే వాళ్లను విమర్శించే అర్హత లేదని, ముందు తన సొంత కుటుంబ వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని మంత్రి సూచించారు. జైలు నుంచి వచ్చిన తన సోదరి కవిత అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనవసరంగా విమర్శిస్తే సహించేది లేదని, ఏది పడితే అది మాట్లాడితే కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లకు వచ్చి మరీ జవాబు చెప్తామని హెచ్చరించారు. పదేళ్ల పాలనలో నువ్వు తెలంగాణకు ఏం చేశావో దమ్ముంటే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

**2029లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే..**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన' ద్వారా ప్రజలకు జవాబుదారీగా, పారదర్శకంగా పని చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. కొందరు నాయకులు మార్పు కావాలని మాట్లాడుతున్నారని, సం

# అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం

-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్.
-జిల్లాలో ఆకస్మికంగా పెట్రోలింగ్ వ్యవస్థ తనిఖీ.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 22

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ జగిత్యాల, కోరుట్ల, మేడిపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





## యువత మారితేనే దేశ భవిష్యత్తు మారుతుంది -- కన్నం సుదర్శన్ ప్రేరణాత్మక సందేశం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్, న్యాయవాది, సామాజికవేత్త, సంఘసంస్కర్త అయిన కన్నం సుదర్శన్ యువతకు హృదయపూర్వక సందేశం అందించారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, యువశక్తి సరైన దిశలో నడిస్తే సమాజం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "యువతే దేశానికి వెన్నెముక. నేటి యువత ఆలోచనలు, పనితీరు రేపటి సమాజ నిర్మాణానికి పునాది అవుతాయి. ప్రతి యువకుడిలో అపారమైన ప్రతిభ, ఆలోచనా శక్తి, మార్పు తీసుకురాగల సామర్థ్యం దాగి ఉంది. అయితే ఆ శక్తిని సరైన దారిలో వినియోగించడం చాలా అవసరం" అని అన్నారు. ప్రస్తుత కాలంలో చాలా మంది యువత సమయ విలువను మరిచిపోతున్నారని, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, అనవసర అలవాట్లకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల కొద్దీ ఫోన్లలో గడపడం వల్ల విలువైన భవిష్యత్తు దెబ్బతింటోందని పేర్కొన్నారు. "పోయిన సమయం తిరిగి రాదు" అనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని, ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప లక్ష్యం ఉండాలని, లక్ష్యం లేకుండా గడిచే జీవితం దారిలేని పడవ లాంటిదని చెప్పారు. చదువు మాత్రమే కాకుండా నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణ, పట్టుదల కూడా విజయానికి ఎంతో అవసరమని వివరించారు. చిన్న చిన్న అపజయాలకు నిరాశ చెందకుండా వాటిని పాఠాలుగా తీసుకుని ముందుకు సాగితే తప్పకుండా విజయం సాధించవచ్చని అన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం కూడా జీవితంలో చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. మంచి ఆలోచనలు కలిగిన వ్యక్తులతో ఉండడం వల్ల మన జీవితం సానుకూల దిశగా సాగుతుందని చెప్పారు. సమాజ సేవ పట్ల యువతలో ఆసక్తి పెరగాలని, పెద్దలను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. మనం ఎదగడమే కాదు, మనతో పాటు ఇతరులను కూడా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి యువకుడిపై ఉందన్నారు. గ్రామాభివృద్ధి, పేదల సహాయం, విద్య, ఆరోగ్యంపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో కూడా యువత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. క్రీడలు, వ్యాయామం, యోగా, మంచి ఆహారపు అలవాట్లు యువతను ఆరోగ్యవంతులుగా మార్చుతాయని పేర్కొన్నారు. "మీరు ఎదిగితే మీ



కుటుంబం ఎదుగుతుంది... కుటుంబం ఎదిగితే గ్రామం ఎదుగుతుంది... గ్రామం ఎదిగితే దేశం అభివృద్ధి చెందుతుంది" అని ఆయన ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు. ఈ రోజు చేసే కష్టమే రేపటి విజయానికి బలమైన పునాది అవుతుందని, యువత తమ బాధ్యతలను గుర్తించి సరికొత్త ఆలోచనలతో, ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చివరగా యువత తమ జీవితాలను మాత్రమే కాకుండా సమాజాన్ని కూడా మార్చగల శక్తిగా నిలవాలని, యువత విజయమే దేశ విజయానికి మార్గమని కన్నం సుదర్శన్ ఆకాంక్షించారు.

# ఉచిత యోగా శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానం





-మహిళలు, పిల్లల ఆరోగ్యానికి ప్రత్యేక యోగా తరగతులు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక


మన భారతదేశ వారసత్వ సంపద అయిన యోగాను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ హాల్లో మహిళలు మరియు పిల్లల కోసం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ యోగా శిక్షణను మహిళా యోగా శిక్షకురాలు టి. స్వప్న (ఎంఎస్సీ ఇన్ యోగా) గారు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటల నుండి 7-00 గంటల వరకు నిర్వహించనున్నారు. యోగాభ్యాసం ద్వారా అనేక రుగ్మతులకు పరిష్కారం లభిస్తుందని, శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్య వంతమైన జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యానగర్, గీతానగర్, భవన్ రుషినగర్, పోచమ్మ వీధి, అంబేద్కర్ నగర్, మార్కండేయ టెంపుల్ స్ట్రీట్, వెంకటేశ్వర టెంపుల్ స్ట్రీట్, కంచర వీధి, సుభాష్ నగర్ తదితర అన్ని వార్డుల పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమానికి మహిళలు, పిల్లలు మరియు పట్టణ ప్రజలందరూ ఆహ్వానితులని తెలిపారు.

# అక్రమ మట్టి తవ్వకాలపై పోలీసుల ఉక్కుపాదం

-జిల్లా వ్యాప్తంగా 19 కేసులు నమోదు
-45 వాహనాలు సీజ్ :ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

జిల్లాలో అనుమతి లేకుండా సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. అక్రమ మట్టి తరలింపును అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ మట్టి రవాణాకు సంబంధించి మొత్తం 19 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో నిబంధనలు ఉల్లంఘించిన 45 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాటిలో 27 ట్రాక్టర్లు, 11 టిప్పర్లు, 7 జేసీబీలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా మట్టిని తవ్వాలన్నా, నిల్వ చేయాలన్నా లేదా రవాణా చేయాలన్నా సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా చేపట్టిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై వరుస దాడులు కొనసాగిస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.



జిల్లా పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినా, నిల్వ చేసినా లేదా తరలిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లా సంపదను కాపాడటంలో ప్రజలు భాగస్వాములు కావాలని, అక్రమార్కుల సమాచారాన్ని అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## సెన్సెస్ 2027 మొదటి దశ ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలి : మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



చేగుంట మే 22(తెలంగాణ పత్రిక )

చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సెన్సెస్ 2027 మొదటి దశలో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణన ను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. ఎనుమ రేటర్ ఇండ్ల గణన నమోదు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి తప్పులు లేకుండా, ఖచ్చితమైన సమాచారం వచ్చే విధంగా నిర్వహించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి, చేగుంట ఎమ్మార్వో శివ ప్రసాద్,ఎంపీడిఓ టి. చిన్న రెడ్డి, ఏ ఎస్ ఓ భూమేష్, సూపర్వైజర్ చల్లా లక్ష్మణ్, ఎనుమరేటర్ రజిని,ఆర్ఐ జయ భారత్ రెడ్డి, సెక్రెటరీ సమీనా సుల్తానా, ఉప సర్పంచ్ స్వామి, వార్డ్ మెంబెర్స్ రాజేష్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రెడ్ ప్యాకెట్లు అరటి పండ్ల పంపిణీ కార్యక్రమం



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో శుక్రవారం రోజు బ్రెడ్ ప్యాకెట్లు, అరటి పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టే పూజ -- ఈశ్వర్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమానికి సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోట్రస్టు కోశా ధి కారి దూలం భూమేష్ గౌడ్, ఎద్దండి రాజు, మల్కాపురం ప్రశాంత్ గౌడ్, వాసాల హరిప్రసాద్, గోటి నవీన్, వేముల సతీష్, పబ్బ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గడ్డమీది సాయి చంద్ పుట్టినరోజు వేడుకలు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం ప్రజల గొల్లపల్లి గ్రామంలో గడ్డమీది సాయి చంద్ పుట్టినరోజు వేడుకలు ఉపాధి హామీ కూలీలు ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై గడ్డమీది సాయి చంద్ తో కేక్ కట్ చేయించడం జరిగింది, మరియు సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికుల తరపున గడ్డమీది సాయి చంద్ పుట్టినరోజు జరుపుకోవడం చాలా సంతోషకరం అదేవిధంగా ఈ పని ప్రదేశంలో మీకు ఎలాంటి సమస్యలను నా దృష్టికి తీసుకురావాలని నా తరపున ఐదు కూల్ బబుల్స్ మంచినీళ్లు పంపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఇది గడ్డమీది సాయి చంద్ పుట్టినరోజు సందర్భంగా మీకు ఇస్తున్న బహుమతి అని చెప్పడం జరిగింది, గడ్డమీది సాయి చంద్ పుట్టినరోజు సందర్భంగా 200 మజ్జిగ ప్యాకెట్లు వార్డు సభ్యులు అందే దేవరాజ్ పంపిణీ చేశారు మరియు ఉపాధి హామీ కార్మికుల తరపున కేక్ తీసుకురావడం జరిగింది, ఈ కార్యక్రమంలో గడ్డమీది సాయి చంద్ జన్మదిన సందర్భంగా గొల్లపల్లి మరియు దేవుని గుట్ట ఉపాధిహామీ కార్మికులు కార్మికులు గడ్డమీది సాయి చంద్ కు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్ అందే చంద్రయ్య, వార్డు సభ్యులు ఆకుల మున్నారు రామ చంద్రం, దాసరపు సంగీత అశోక్ దాసరి లావణ్య సత్తిష్ మాజీ వార్డ్ సభ్యులు పాటి దేవయ్య, బైరి తిరుపతి, డీలర్ చంద్రం, పాశం ప్రశాంత్, గండ్ల శ్రీనివాస్,బండి హరికృష్ణ, బట్టు నరేష్ పెండల బాలకృష్ణ, బట్టు శంకర్ ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా నిజాన్



## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

-నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి బోనాల పండుగ లో పాల్గొన్న జీవన్ రెడ్డి



జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) మే 22

జగిత్యాల రూరల్ మండలం హబ్సిపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి పట్నాలు,బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నమాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాయ కష్టానికి ప్రతీక ముదిరాజ్ సోదరులు, పెద్దమ్మ తల్లి ఆశీర్వచనలతో వాళ్లకు కష్టాలు ఎదురుకాకుండా తల్లి దీవెనలు ఎప్పటికి ఉండాలి అని అన్నారు.రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ముదిరాజ్ కులస్తులు వారి ప్రధాన వృత్తి చేపల వృత్తి.కాని గ్రామాలలో చెరువులు,కుంటలపై ఆధిపత్యం మత్స్య పారిశ్రామిక సంఘాలకు ఉంటుంది.పండ్లు,పలాలు, కాయగూరలు విక్రయిస్తూ ముదిరాజ్ ఆడబిడ్డలు, సోదరులు కాయ కష్టం చేస్తారు.ప్రభుత్వ పరంగా ముదిరాజ్ కులస్తులను ఆదుకోవడానికి ఆర్థికంగా సహాయం చేయడం ప్రధానం. ప్రభుత్వాలు ఆలోచనకే పరిమితం అవుతున్నాయి తప్ప కార్యరూపంలో లేదు.చేపనారు సమయానికి అనుగుణంగా జూలై ఆగస్టులో పోస్తే వృద్ధి చెంది ఫలితం కనిపిస్తుంది.మత్స్య కార్మికులు వారికి వారే చేపనారు కోసుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలో 750 చెరువులు కుంటలు ఉంటే ప్రభుత్వపరంగా కేవలం 250 మాత్రమే చేపనారు పోశారు. దచేపనారు ప్రభుత్వపరంగా పోసి దళారులకు లాభం చేకూర్చే కంటే, చెరువు విస్తీర్ణతను పరిగణన లోకి తీసుకొని మత్స్య పారిశ్రామిక సంఘాలకు ప్రత్యక్షంగా అందించినట్టయితే వారి సమయానికి అనుగుణంగా చేప నారు కొనుక్కొని చేపల వృద్ధి చేసుకొనే అవకాశం ఉంటుంది అని అన్నారు.ముదిరాజ్ లకు ఏ విధమైన సమస్య ఉత్పన్నమైన తోడుగా ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో హబ్సిపూర్ గ్రామ ముదిరాజ్ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి

-రైతాంగానికి అన్యాయం చేస్తున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్న్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక





రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం వరదవెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆమ్లెట్ గ్రామం దుబ్బపల్లి చిట్కుచెరువు మరియు విలాసాగర్ గ్రామంలోని పెద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత వారం రోజులుగా ఎలాంటి నియంత్రణ లేకుండా, సమయపాలన పాటించకుండా ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీల ద్వారా చెరువుల మట్టిని తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని మండల ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లినా "మా చేతిలో ఏమీ లేదు" అంటూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఒకవైపు ప్రభుత్వం చెరువుల మట్టి తరలింపుకు అనుమతులు ఇవ్వడం లేదని చెబుతుండగా, మరోవైపు ఇరిగేషన్ శాఖ అధికారులు అనధికారిక పర్మిషన్ల పేరిట మట్టి తరలింపుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ మట్టి దందా కారణంగా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, చెరువుల పరిరక్షణకు ముప్పు వాటిల్లుతోందని తెలిపారు.చెరువులు రైతాంగానికి జీవనాధారం అని, వాటి నుంచి విచ్చలవిడిగా మట్టి తరలించడం వల్ల భవిష్యత్తులో సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతాంగం పక్షాన నిలబడి చెరువుల మట్టిని కాపాడాలని సిపిఎం పార్టీ తరపున గురజాల శ్రీధర్ పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

## ముంచుకొస్తున్న నైరుతి తెలంగాణ ఏపీలో వర్షాలు.. వాతావరణశాఖ లేటెస్ట్ అప్డేట్ ఇదిగో

మే 22, తెలంగాణ పత్రిక

ఏపీ, తెలంగాణకు సంబంధించి వాతావరణశాఖ వెదర్ రిపోర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదురుతున్నాయి. దీంతో పాటు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నాయి. రాబోయే మూడ్రోజుల పాటు వర్షాలు పడనున్నాయని శుక్రవారం వాతావరణశాఖ అంచనా వేసింది. ఏపీ, తెలంగాణకు వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. రాబోయే 2-3 రోజులలో నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన భాగాలతో పాటు తూర్పు-మధ్య బంగాళా ఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఇక గురువారం తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి ఒడిస్సా కోస్తా తీరం వరకు కొనసాగిన ద్రోణి.. ఈరోజు వాయువ్య ఉత్తరప్రదేశ్ నుండి తూర్పు ఉత్తర ప్రదేశ్ ఛత్తీస్గఢ్ మీదుగా అంతర్గత ఒడిస్సా ప్రాంతంలో కొనసాగుతోంది. సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. తెలంగాణకు కూల్ న్యూస్ ఇక మధ్య బంగాళాఖాతం, నైరుతి బంగాళాఖాతం మీదుగా తమిళనాడు వరకు కొనసాగిన ద్రోణి ఈరోజు బలహీనపడింది. వీటి ప్రభావంతో ఈరోజు, రేపు తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.



రాష్ట్రంలో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఇక శుక్రవారం తెలంగాణలోని కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావణ కేంద్రం పేర్కొందిఉపరితల ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో నేడు, రేపు పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులకు అవకాశముంది. తీవ్ర వడగాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. రాత్రిపూట వెచ్చగా ఉండే అవకాశం ఉన్నది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకట లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. దక్షిణ కోస్తా, రాయలసీమలో కూడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గరిష్టంగా గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

# అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం







-అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లాస్థాయి సభ జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితె తదితరులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని వినిపించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పనులపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద మార్చి 6వ తేదీ నుంచి వివిధ శాఖల ఆద్వర్యంలో చేపట్టిన పనులు, పురోగతి, అవగాహన సదస్సులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, ఎంపీడీఓ లకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, వ్యవసాయ, ఉద్యానవన, మహిళా సంఘాలు, మత్స్య శాఖ తదితర శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వాటి సమాచారాన్ని సభకు వచ్చిన ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియ జేయడం, చైతన్యపర్చడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో 27 నెలలుగా ప్రజా పాలన సాగుతున్నదని, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందుతుందని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు నిర్వహించామని, అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యులు చేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ నిలుస్తుందని వెల్లడించారు. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు తమిళనాడు లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు అవుతుందని, కేరళలో కూడా ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మిగితా రాష్ట్రాలు కూడా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరవేస్తున్నాయని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ, బీసిల జనగణన చేశామని పేర్కొన్నారు. త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ భీమా పథకం దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా ఇక్కడ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న వారి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు రుణ మాఫీ చేశామని, రైతు భరోసా అందిస్తున్నామని వెల్లడించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు.కార్మిక, ధార్మిక క్షేత్రం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని స్పష్టం చేశారు. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు కోటి చీరల ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, గతంలో కూడా ఇచ్చామని దీంతో కార్మికులకు 6 నుంచి 7 నెలల పాటు ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. మొదటి సారి చీరల ఆర్డర్ నీలి రంగు ఇచ్చామని, ఇప్పుడు ఆకు పచ్చ రంగు ఇచ్చామని తెలిపారు. వస్త్ర పరిశ్రమకు బకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. రాష్ట్రం మొత్తం పంపిణి చేసే చీరలు ఇక్కడి సిద్ధం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలు మొదట స్వశక్తి సంఘాలకు ఇచ్చామని, ఇప్పుడు అందరికి ఇస్తున్నామని వెల్లడించారు. 37 వేల మంది మహిళలకు చీరలు సిరిసిల్లలో ఇస్తామని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శంకు స్థాపన చేశారని గుర్తు చేశారు. మరో వెయ్యి ఏండ్ల పాటు ఆలయం ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. సొంత ఇంటి కల నిజం చేసేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు సొంత ఇల్లు కల నిజం చేయడంతో పాటు ఎందరికో ఉపాధి మార్గం దొరుకుతుందని తెలిపారు. త్వరలో రెండో దశలో అర్హులకు ఇస్తామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని, రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తామని తెలిపారు.కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచామని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి వస్తాయని, ఒక్కో స్కూల్ లో 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 36 వేల బెడ్స్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. లో వోల్టేజి పరిష్కారానికి సబ్ స్టేషన్ల ప్రారంభించామని, నూతన వాటి నిర్మాణానికి శంకు స్థాపన చేశామని పేర్కొన్నారు. రైతులు నిర్ణీత డబ్బులు చెల్లిస్తే రైతులకు విద్యుత్ కనెక్షన్, స్తంభాలు ఇస్తారని, అలాగే ఇందిరమ్మ ఇండ్ల వద్ద ఉన్న లూస్ వైర్లు, స్థంభాలు తొలగిస్తారని తెలిపారు. జిల్లా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మొత్తం 99 రోజుల కార్యాచరణ కింద 10 థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మొదటగా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు పెట్టమని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పూర్తిలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. వేములవాడ రాజన్న గుడి విస్తరణ, అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లాలోని అందరి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. రానున్న అన్ని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అల్పాహారం పథకం, కుటుంబ జీవిత బీమా, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం పథకం, దివ్యాంగ విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్నదని తెలిపారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద పోలీస్ శాఖ ఆద్వర్యంలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు, దీంతో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయని వివరించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని గుర్తు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్, హెవీ స్పీడ్ తో వెళ్ళడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి.. చికిత్స, కౌన్సెలింగ్ ఇస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వేసవిలో పిల్లలపై తల్లితండ్రులు దృష్టి సారించాలనిసూచించారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ నాగేంద్రచారి, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం



**-పాల్గొన్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్,ఎమ్మెల్యే సంజయ్.**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 22



రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు,ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన శాఖ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ రెండు కళ్ళుగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. 99 రోజులు పది అంశాలపై కార్యక్రమాలు గ్రామ, మండల, నియోజకవర్గ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు నివేదికలను తయారుచేసి దశలవారీగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చ్ 6 నుండి జూన్ 9 వరకు నిర్వహించు కార్యక్రమాలను వివరించారు. ప్రారంభం నుండి జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. శాఖల వారీగా సాధించిన ప్రగతిని డాక్యుమెంటరీ రూపంలో సభలో ప్రదర్శించామని తెలిపారు. ప్రతి శాఖ తమ శాఖకు సంబంధించిన పురోగతి, ప్రజలకు అందించిన సేవలు, ప్రభుత్వ పథకాల అమలు వివరాలను సభలో వివరించిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆర్థిక సహాయాల పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ తదితర పథకాల అమలు వివరాలను సభలో తెలియజేశారు. ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలపై కూడా శాఖల అధికారులు వివరాలు అందించారు. జిల్లాలో నిర్వహించిన బడిబాట,జాబ్ మేళాలు,అవగాహన కార్యక్రమాలు, గ్రామ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సహాయంతో తమ జీవన విధానంలో వచ్చిన మార్పులను వివరించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల, మెట్ పెల్లి, కోరుట్ల, రాయికల్,ధర్మపురి మున్సిపల్ చైర్మన్లు , మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వివిధ స్థాయిల ప్రజా ప్రతినిధులు,కౌన్సిలర్ లు, సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సోదరులిద్దరూ రక్షణ వీరులు


**-దేశ రక్షణలో 'కీర్తి' కిరీటాలు**
**-సరిహద్దు భద్రత ఒకరిది... అంతర్గత రక్షణ మరొకరిది**
**-ఉగ్రవాదుల వేటలో అన్న.. తీవ్రవాదులు అదుపులో తమ్ముడు**

నంగునూరు, మే 22 (తెలంగాణ పత్రిక):

ఒకే తల్లి కడుపున పుట్టి, ఒకే ప్రభుత్వ పాఠశాలలో చదివి, నేడు దేశ రక్షణ కోసం భారత సరిహద్దుల్లో ఒకరు... నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మరొకరు... ప్రాణాలను పణంగా పెడుతున్న ముద్దు బిడ్డలు వారు. కష్టాలు వారిని కుంగదీయాలని చూశాయి.. కానీ వారి గుండెల్లోని దేశభక్తి హిమాలయమంత ఎత్తుకు ఎదిగింది! చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, కన్నతండ్రి ఆశయాన్ని నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. బట్టల షాపులో సేల్స్‌మెన్‌గా పని చేసిన చేతులతోనే.. నేడు దేశ రక్షణ కోసం ఏకే-47 తుపాకులు పట్టారు. ఒకే కుటుంబం నుండి ఇద్దరు కొడుకులు దేశ సేవకు అంకితమై, సిద్దిపేట జిల్లా నంగునూరు 'కీర్తి'ని దేశ వ్యాప్తంగా చాటుతున్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన కీర్తి సాయి రామ్, కీర్తి చందు ప్రస్థానంపై కథనం సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం కేంద్రం నంగునూరుకు చెందిన కీర్తి వెంకట నారాయణ, విజయ దంపతుల కుమారులు సాయి రామ్, చందు. తమ పిల్లలు దేశాన్ని కాపాడే గౌరవప్రదమైన యూనిఫాం ధరించాలనేది తండ్రి వెంకట నారాయణ జీవిత కాల కల. వెంకట నారాయణ, విజయ దంపతులు బట్టలు కుడుతూ కుటుంబాన్ని పోషించుకునే వారు. దంపతులిద్దరూ రేయింబవళ్ళు కష్టపడుతూనే తమ పిల్లలను చదివించారు. తన పిల్లలిద్దరినీ దేశ రక్షణ రంగ ఉద్యోగులుగా చూడాలని కలలు గన్న వెంకట నారాయణ తన కల నెరవేరకుండానే 2019 ఫిబ్రవరి 10వ తేదీన అకస్మాత్తుగా మరణించారు. సాఫీగా సాగుతున్న ఈ కుటుంబం చిక్కుల్లో పడింది. కానీ, ఆ ఇద్దరు అన్నదమ్ములు వెనకడుగు వేయలేదు. నంగునూరులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూనే, రాత్రి పూట కుటుంబ వస్త్ర దుకాణం "న్యూ ఏజ్ మెన్స్ వేర్" లో సేల్స్‌పర్సన్‌లుగా పనిచేశారు. పగలు పుస్తకాలతో, రాత్రి పూట కష్టాలతో పోరాడి తండ్రి కన్న కలని నిజం చేసేందుకు నిరంతరం శ్రమించారు.

**-సరిహద్దు భద్రతలో కీర్తి సాయి రామ్**

వెంకట నారాయణ, విజయ దంపతుల పెద్ద కుమారుడైన కీర్తి సాయి రామ్ నంగునూరులోని శ్రీ వాణి విద్యాలయంలో 7వ తరగతి వరకు చదివాడు. ఆ తర్వాత, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.సి. వరకు చదివాడు. ఎస్సెస్సీలో 8.0 జీపీఏ సాధించాడు. సిద్దిపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివి 894 మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్, దోమల్‌గూడలో ఉన్న ఎ.వి. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ నుండి 79 శాతం మార్కులతో బీఎస్సీ ఎంపీసీ పట్టా పొందాడు. ఆర్మీ, నేవీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వంటి సాయుధ దళాలలో గౌరవప్రద యూనిఫాం ధరించాలనే తన తండ్రి ఆశయం మేరకు సాయిరాం వివిధ రక్షణ రంగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ పరిధిలోకి వచ్చే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) లో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. కఠిన శ్రమకు ప్రతిరూపం ఆయన కీర్తి సాయి రామ్ 2021ఏప్రిల్ 1 వ తేదీన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ లో ఉద్యోగంలో చేరాడు. జార్ఖండ్‌లోని మేరు ట్రైనింగ్ సెంటర్‌లో కఠోర శిక్షణ ముగించుకుని, మూడేళ్ల పాటు గుజరాత్ సరిహద్దుల్లో సేవలు అందించాడు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి, కదంతల వద్ద... అత్యంత ప్రమాదకరమైన, సున్నితమైన ఇండో-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దుల్లో దేశ రక్షణ కవచంలా పహారా కాస్తున్నాడు.

**-అన్న దారిలో తమ్ముడు.. నక్సల్స్ అడ్డాలో కీర్తి చందు!**

కీర్తి వెంకట నారాయణ, విజయ దంపతుల రెండవ కుమారుడైన కీర్తి చందు నంగునూరులోని శ్రీ వాణి విద్యాలయంలో ఏడవ తరగతి వరకు, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.సి. వరకు చదివారు. ఎస్.ఎస్.సి. లో 8.3 జీపీఏ సాధించారు. సిద్ధిపేటలోని ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) చదివి 65 శాతం మార్కులు సాధించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ లోని మెదక్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్(ఈఈఈ) చదువు తున్నాడు. బీటెక్ చదువుతూనే తన సోదరుడు కీర్తి సాయి రామ్ మార్గదర్శకత్వంలో రక్షణ రంగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. అన్న సాయి రామ్ సాధించిన విజయం తమ్ముడు చందుకు ఊపిరి పోసింది. అన్న ఇచ్చిన ధైర్యంతో, గైడెన్స్‌తో హైదరాబాద్‌లో కఠినమైన శారీరక శిక్షణ తీసుకున్నాడు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ పరిధిలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కు ఎంపికై 2025 జనవరి 23వ తేదీన ఉద్యోగంలో చేరారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీలో కమాండో తరహా శిక్షణ పూర్తి చేసుకున్నాడు. ప్రస్తుతం దేశంలోనే అత్యంత ప్రమాదకర జోన్ అయిన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో "యాంటీ నక్సల్ ఏరియా ఆపరేషన్స్"లో శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాడు.

**-సర్కారు బడి పిల్లలం".. గురువులకు సలాం!**

"మేము కార్పొరేట్ చదువులు చదవలేదు.. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి వచ్చాం. మాకు అండగా నిలిచిన మా ఉపాధ్యాయులకు తలవంచి నమస్కరిస్తున్నాం" అని ఈ రక్షణ సోదరులు గర్వంగా చెబుతున్నారు. ఒక కొడుకు అంతర్జాతీయ సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుతుంటే.. ఇంకో కొడుకు దేశం లోపల అంతర్గత శత్రువులను ఏరిపారే స్తున్నాడు. ఒకే కడుపున పుట్టిన ఇద్దరూ బిడ్డలు దేశాన్ని కాపాడుతుంటే వారి తల్లి 'విజయ' గర్వంతో సంతోషిస్తోంది. కష్టాలకు ఎదురు నిలిచి దేశ సేవలో నిలిచిన ఈ సోదరుల కథ ప్రతి ఒక్కరి నరనరాల్లో దేశభక్తిని పెంపొందించి, యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

## డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ జన్మదిన వేడుకలు

**-వృద్ధులకు అరటిపండ్లు, సల్ల ప్యాకెట్ల పంపిణీ**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు అరటిపండ్లు మరియు సల్ల ప్యాకెట్లను పంపిణీ చేసి సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మల్లరపు చందు, బవండ్ల కమలాకర్, రాజయ్య, శ్రీనివాస్, గణేష్, అజయ్ తదితర యువకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. నాయకులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.

## సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ కన్నాను పరామర్శించిన మంత్రి అడ్లూరి



జగిత్యాల ప్రతినిధి, మే 22, (తెలంగాణ పత్రిక )

జగిత్యాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ కన్నా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ముకేష్ కన్నా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, వైద్యుల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ముకేష్ కన్నా నిరంతరం కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముకేష్ కన్నా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద ముబారక్‌పూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు సక్రమంగా కొనసాగుతున్నాయి : వి.సురేష్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా కొనసాగుతున్నాయని గ్రామానికి చెందిన సురేష్ వి తెలిపారు. గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి అవసరమైన పలు పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల ద్వారా పేద మరియు కూలీ కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, దీంతో గ్రామ ప్రజలు ఆర్థికంగా కొంత మేరకు బలపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చెక్‌డ్యాంల నిర్మాణం, మట్టి పనులు, కాలువల శుభ్రపరిచే కార్యక్రమాలు, మొక్కల సంరక్షణ వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహిస్తూ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా పనులు కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా పనుల్లో చురుకుగా పాల్గొంటూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాభివృద్ధికి అందరూ కలిసి ముందుకు రావాలని సురేష్ కోరారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా నినాదం



## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్ఓసీ మంజూరు

**-అమెరికా నుంచి ప్రత్యేక చొరవ తీసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు**



**నంగునూరు, మే 22(తెలంగాణ పత్రిక):** ఇటీవల భద్రాచలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వైద్యం కోసం మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అమెరికా నుంచి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అవసరమైన ఆర్థిక సహాయం కోసం ఎల్ఓసీ మంజూరు చేయించారు. నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పులిగిల్ల లింగప్రసాద్ హనుమాన్ మాల విరమణకు వెళ్లి భద్రాచలం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్య ఖర్చుల కోసం అవసరమైన మొత్తానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్ఓసీ ఇప్పించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, వెంకటాపూర్ సర్పంచ్ రేకులపల్లి సంతోష్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావును సంప్రదించారు. హరీశ్ రావు అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా పరిస్థితిని వాకబు చేశారు. వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపట్టాలని ఇక్కడి వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు రూ. 2 లక్షల ఎల్ఓసీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు శుక్రవారం సిద్ధిపేటలోని హరీశ్ రావు క్యాంపు కార్యాలయంలో పులిగిల్ల లింగ ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు.

## విజిట్ టు ద మ్యూజియం బస్సు ప్రారంభం

**-జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 23 వ తేదీ వరకు యువజన, క్రీడ, టూరిజం వారోత్సవాలు కొనసాగుతున్నాయి . ఇందులో భాగంగా విజిట్ టు ద మ్యూజియం ఎట్ కరీంనగర్ లో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లే ఆర్ టీ సీ బస్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జగన్ మోహన్ రెడ్డి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖా అధికారి ఎ.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**-ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి**
**-నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు**
**-రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
**-మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**



**వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 22 (తెలంగాణ పత్రిక):** పశువుల అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ ఉండదని కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత అనుమతి పత్రాలు, రవాణా ధృవపత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది ట్రాఫిక్ బ్యాటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఎస్సై ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.


# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో బాలికల హెల్త్ క్యాంప్





**చండూర్ తెలంగాణ పత్రిక మే 22** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణ ప్రణాళికల కార్యక్రమంలో స్థానిక PR గెస్ట్ హౌస్ నందు మెప్మా అద్వర్యంలో "కౌమార బాలికలు 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, హెల్త్ క్యాంపును ప్రారంభించారు. మున్సిపల్ కమీషనర్ ఎల్ మల్లేశం,మాట్లాడుతూ మానవ వికాస దశల్లో కౌమార దశ అతి ముఖ్యమైనదని, శారీరక మానసిక మార్పులు జరిగే దశగా చెప్పటమైంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని పేర్కొనటమైంది. తగు సూచనలు చేశారు. ఇట్టి కార్యక్రమముకు చైర్ పర్సన్ డా. కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం, వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్స్, కో ఆప్షన్స్ సభ్యులు , పాల్గొన్నారు.డా. జెస్సి , మెప్మా ౹వీజ ఎన్. సరిత , ANM, ఆశా వర్కర్లు, RP\T తదితరులు పాల్గొన్నారు.

# యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం : వేముల మార్కండేయులు






**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంపై యువజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లపై యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రాధాన్యతను ప్రస్తావించిన తీరు ఎంతో ఆనందాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు.99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ప్రభుత్వ పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడంలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలుకావడానికి పర్యవేక్షణ చేసే బాధ్యతను యువజన సంఘాలు సమర్థంగా నిర్వహిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భారత్ నిర్మాణం వాలంటరీ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వేముల మార్కండేయులు మాట్లాడుతూ, పౌరుడిని కేంద్ర బిందువుగా చేసుకుని పారదర్శక పాలన అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పేదలు, రైతులు, నేతన్నలు, నిరుపేదల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు.ప్రజాపాలన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాన కార్యదర్శి జిందం తిరుపతి, ఉపాధ్యక్షులు బండి ఆంజనేయులు, పద్మశాలి జాతీయ సేవాదళం కన్వీనర్ కటకం రమేష్, మణికంఠ కార్మిక సంఘం అధ్యక్షులు వెంగళ వెంకయ్య, పద్మశాలి జాతీయ సేవాదళం కన్వీనర్ బండి శ్రీనివాస్, నెహ్రూనగర్ పద్మశాలి జాతీయ సేవాదళం కన్వీనర్ దిద్ది సత్యనారాయణ తదితరులు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.గ్రామీణ స్థాయిలో పేద ప్రజల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలను ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమని వేముల మార్కండేయులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వారధిగా పనిచేస్తున్న సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేయడం మంచి పరిణామమని అన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26 సందర్భాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డులు అందించాలని ఆయన కోరారు. పేదరిక నిర్మూలన కోసం అంకితభావంతో పనిచేస్తున్న సేవా సంస్థలకు మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా స్థాయి సమావేశాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కరపత్రాలు, వాల్ పోస్టర్లు యువజన సంఘాల నాయకులను మరింత ఉత్తేజపరిచాయని తెలిపారు. సమాజ సేవ పట్ల మరింత నిబద్ధతతో ముందుకు సాగేందుకు ఈ గుర్తింపు దోహదపడుతుందని పేర్కొన్నారు. మానవ సంబంధాలు క్రమంగా ధన సంబంధాలుగా మారుతున్న ఈ కాలంలో సేవాభావాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వేముల మార్కండేయులు అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక గ్రామ గ్రామాన చైతన్యం నింపుతోందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

# కొత్తగూడ, గంగారం మండలాలలో ఆర్టీసీ బస్టాండ్ లను నిర్మించాలి

**-ఉమ్మడి మండలం లో ఆర్ టి సి బస్సుల కొరత లేకుండా చూడాలి**
**-కొత్తగూడ మండల తుడుందెబ్బ అధ్యక్షుడు పూనేం సందీప్**

**కొత్తగూడ మండల ప్రతినిధి మే 22. (తెలంగాణ పత్రిక)** మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఉమ్మడి కొత్తగూడ మండలం ఏజెన్సీ ప్రాంతం అయిన కొత్తగూడ, గంగారం మండలాల గిరిజన, గిరిజనేతర మహిళలు కొన్ని గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నోచుకోవడంలేదని, కొత్తగూడ మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు పూణేం సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు గ్రామాల నుండి మండల కేంద్రానికి, పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులో ఉన్న కొత్తగూడ, గంగారశీ మండలాల ప్రజలు నర్సంపేట, హన్మకొండ, వరంగల్, ప్రాంతాలకు అటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణాలకు పనుల నిమిత్తం తరచూ వెళ్ళవలసి వస్తుందని, సరిపడా బస్సులు లేక, ప్రజల ప్రయాణాల ఇబ్బందులు వర్ణాతీతంగా ఉన్నాయని వాపోయారు. ప్రైవేట్ వాహనాల సహాయం తో వెళ్ళవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బత్తులపల్లి, కార్లయి, గోపాలపురం, మాసంపల్లి, తాటివారివేంపల్లి గ్రామాలను కలుపుకొని, తాటి వారి వేంపల్లికి ఆర్టిసి బస్సు నర్సంపేట డిపో నుండి వస్తుండేది. గత కొన్ని నెలలుగా ఆ రూట్ లో బస్సును నిలిపివేశారని నిట్టూర్చారు. అలాగే గతంలో ఉమ్మడీ కొత్తగూడ మండలం లో వెలుబెల్లి, ఎంచగూడెం అదేవిధంగా మరి కొన్ని గ్రామాలకు ప్రభుత్వం బస్సు వస్తుండేది. ప్రస్తుతం ఆయా గ్రామాలకు బస్సులు రాక, ప్రజలు దూరతీర ప్రాంతాలకు ప్రయాణం చేయలేక, గిరిజన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదనను వ్యక్తపరిచారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉమ్మడి కొత్తగూడ మండలం లో ఆర్ టి సి బస్సు ల కొరత లేకుండా చూడాలని, అలాగే గతంలో హన్మకొండ డిపో నుండి వయా: నర్సంపేట, కొత్తగూడ, గంగారం రూట్ లో ఇల్లందు వరకు బస్సు ఉండేదని, ప్రస్తుతం నిలిపి వేశారని తెలిపారు. నిత్యం దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వం స్పందించి మళ్ళీ ఈ రూట్ లో ఆర్ టి సి బస్సులను కొనసాగించాలని, కొత్తగూడ, గంగారం మండలాలకు బస్టాండ్ లు



నిర్మించాలని, మంచినీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం లేక ప్రజలు రోడ్లపై ఇబ్బందులకు గురవుతున్నారని, రోడ్డు పై బస్సు, ప్రైవేట్ వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తుందని, ఉమ్మడి మండల గిరిజన ప్రజలు కోరుతున్నారని, కొత్తగూడ మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు పూనేం సందీప్ ప్రజా పాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.. కోరారు.

# సమస్యలు పరిష్కరించాలని వీవోఏల వినతి



**తానూర్: 22మే(తెలంగాణ పత్రిక)** తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ ,ఎస్సై కు సమ్మె నోటీసును ఐకేపీ వీవోఏ, లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీవోఏ లకు కనీస వేతనం రూ.26వేలను నేరుగా ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం విస్మరిస్తోందని, తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని వీవోఏ లు ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ అధికారులుగా గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు ముత్యం,సభ్యులు పాల్గొన్నారు.

## 'బక్రీద్'ను శాంతియుతంగా జరుపుకోవాలి

**-సీఐ రవీందర్ నాయక్**




ముధోల్: 22మే(తెలంగాణ పత్రిక)

బక్రీద్ పండుగాను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముధోల్ సీఐ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముధోల్ గ్రామపంచాయ తీ ఆవరణలో జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు ముస్లిం సోదరులకు,గ్రామస్తులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో సమన్వయంగా పండుగాలను జరుపుకోవాలన్నారు. గోవధ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రధాన కూడల వద్ద చెక్ పోస్ట్ వద్ద భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీలు చేస్తున్నామ న్నారు. గోవులను అక్రమరవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ని ఘా పెట్టామన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు. ఎవరికైనా గోవులను తరలిస్తున్న విషయం తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షబానా ఏజాజోద్దిన్, ఆర్ఐ సత్యనా రాయణ పటేల్, ఎస్సై బిట్ల పెర్సిస్, వీడీసీ అధ్యక్షులు విట్టల్, ఈవో అన్వర్ అలీ,వార్డు సభ్యులు,నాయకులు, గ్రామస్తులు తదిత రులు పాల్గొన్నారు.

## కొడుముంజ రామప్ప ఆలయం సమీపంలో విషాదం

**-ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి**



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గుండెలవిసే తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామంలోని రామప్ప ఆలయ సమీపంలో ఈత సరదా ఇద్దరు నవ యువకుల ప్రాణాలను బలితీసుకుంది. నీటిలోకి దిగిన వారు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన హరిచరణ్ గౌడ్ (18), చిర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన మణికంఠ (17) అనే ఇద్దరు యువకులు కొడుముంజ గ్రామంలోని రామప్ప ఆలయ పరిసర ప్రాంతానికి వచ్చారు. ఈ క్రమంలోనే అక్కడ నీటిలోకి ఈత కోసం దిగారు. అయితే, ప్రమాదవశాత్తు నీటి లోతును గమనించలేకనో, లేదా మరేదైనా కారణం చేతనో వారు నీటిలో మునిగిపోయారు. సమీపంలో ఉన్న వారు గమనించేలోపే ఇద్దరు యువకులు నీట మునిగి ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వేములవాడ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను నీటి నుండి వెలికితీసి, క్షుణ్ణంగా పరిశీలించారు.

## అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పది టాపర్లకు ఘన సన్మానం

**-మెమొంటోలతో అభినందన.. విద్యతోనే సమాజాభివృద్ధి: అధ్యక్షుడు బండారి నర్సయ్య**

ఇల్లంతకుంట మే 22 తెలంగాణ పత్రిక



అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 137గా ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మెమొంటోలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బండారి నర్సయ్య మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో మీరు కలలుగన్న చదువులు చదివి డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగి సమాజ మార్పుకు కృషి చేయాలని సూచించారు. మీ చదువు మరో పది మందికి సాయపడేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ మొదటి మెట్టులో రాణించిన మీరు అన్ని తరగతుల్లోనూ ఇదే విధంగా టాప్ ర్యాంకులు సాధించాలని కోరారు. ఇదే విధంగా ప్రతి సంవత్సరం ప్రతిభ కలిగిన విద్యార్థులను క్లబ్ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ జిల్లా చైర్మన్ డా. ఎలగందుల శ్రీనివాస్, జిల్లా పీఆర్వో పుల్లెల శ్యామ్, జిల్లా వైస్ గవర్నర్ విద్యాసాగర్, ఇల్లంతకుంట క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, కోశాధికారి బొంగోని సత్యనారాయణ, పీఆర్వో రాజెల్లయ్య, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, మీడియా ఇన్‌చార్జి దయ్యాల సురేష్, సలహాదారులు మొగిల్ల బాబు, పర్శ ఐలయ్య, కీసరి కనుకయ్య, కోహెడ భాస్కర్, హెల్త్ క్యాంప్, బ్లడ్ డొనేషన్, ఐ డొనేషన్ ఇన్‌చార్జిలు రేగుల కార్తీక్, అంతటి తిరుపతి, దినేష్, కొమిరె శ్రీనివాస్, మహేష్, గడ్డం రవి, మ్యాకల ఐలయ్య, బండారి మాధవి, అంతటి సుజాత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల కష్టాలు తీర్చేది ఎవరు? తీరేదెప్పుడు?

**-365 జాతీయ రహదారిపై రైతులు ధర్నాలు చేసిన, ర్యాలీలు తీసిన అధికారుల తీరు మారలే? రైతు కష్టాలు తీరలే?**

**-తమ ఆవేదనను పత్రిక విలేకరులతో వ్యక్తపరిన రైతు కన్నెకంటి కొండాల్ రెడ్డి**

గూడూరు మండల ప్రతినిధి మే 22. (తెలంగాణ పత్రిక)





మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో పత్రిక పాత్రికేయులతో తమ ఆవేదనను వ్యక్తపరిచిన!, అయోధ్యాపురం గ్రామ రైతు కన్నెకంటి కొండాల్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట వేసి పండించేంతవరకు, పంటకు పట్టిన చీడపీడలను అరికట్టుటకు, మరోపక్క యూరియా బస్తాల కోసం క్యూ లైన్లు కట్టి! ఆనాడు హరిగోశ పడ్డాం!. పంట పండించిన తర్వాత మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించి రైతులు అమ్ముకోవడానికి ఈనాడు నరకయాతన పడుతున్నామని అన్నారు. గూడూరు మండల కేంద్రం లోని 365 జాతీయ రహదారిపై రైతులు ధర్నాలు చేసిన! ర్యాలీలు తీసిన! అధికారుల తీరు మారలే?, రైతుల కష్టాలు తీరలే? మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి నేటికీ సరిగా రెండు నెలలు గడుస్తున్న పంటను అమ్ముకోలేని దీనస్థితిలో రైతులు ఉన్నారని, రైతు రాజ్యం, రైతు పక్షపాతి, ప్రజాపాలన అని చెప్పుకునే? కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో రైతులు నానా నరకయాతన పడుతున్నారని, ఈ ప్రభుత్వంలోని అధికారులు ఎంత చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారో? రైతులకు తేటతెల్లమైందని ఆవేదనను వ్యక్తం చేశారు. తెచ్చిన నెల రోజులకు కాంటాలు అయ్యాయని, కాంటాలు అయ్యి నేటికి నెల రోజులు కావస్తున్నా? గోడౌన్లకు లారీలతో తరలించే నాధుడే? కరువయ్యాడని, కాంటాలు అయిన మొక్కజొన్న బస్తాల కోసం! నేడు భానుడి భగభగ లకు మాడిపోతు, ఈ మధ్యన వీస్తున్న వేడి 43, నుండి 46 డిగ్రీల ఉత్తర గాడ్పులకు రైతులు తమ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని, అల్లాడి పోతున్నారని, అయినా ఆదుకునే అధికారులే కరువయ్యారని, కన్నెకంటి కొండాల్ రెడ్డి వాపోయారు . కొనుగోలు కేంద్రంలో బస్తాలు లేకున్నా! తామే సొంతంగా ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి, మొక్కజొన్నలను నలుగురైదుగురు రైతులు కలిసి, ఒకరి మొక్కజొన్నలను మరొకరు సహాయపడుతూ... నింపుకొని కాంటాలు పెట్టుకున్నామని, ఒక్కొక్క బస్తాకు అధికారులు 51/2 కిలోలు కాంటాలు పెట్టుకున్నారని, ఇలాంటి పరిస్థితులలో అకాల వర్షాలు కురిస్తే?, కురిసిన వర్షానికి మొక్కలు తడిస్తే?, వీటికి బాధ్యత ఎవరు వహిస్తారని పాత్రికేయుడు అడిగిన ప్రశ్నకు? ఇంకెవరు? రైతునే బాధ్యుణ్ణి చేస్తారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా రైతుల ఆవేదనను అర్థం చేసుకుని కొనుగోలు కేంద్రం అధికారులు యుద్ధ ప్రాతిపదికన మొక్కజొన్నలను జిల్లా కేంద్రంలోని గోడౌన్ లలోనికి తరలించి రైతులను ఆదుకోవాలని, కొనుగోలు కేంద్రం అధికారులను కన్నెకంటి కొండాల్ రెడ్డి అనే రైతు కోరారు.

# రోహిణి కార్తె ఎప్పటి నుంచి ప్రారంభం? రోళ్లు పగిలే ఎండలకు కారణం ఇదే

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 22 (తెలంగాణ పత్రిక):



తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రతను సూచించే 'రోహిణి కార్తె' (Rohini Karthi 2026) ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, గ్రహాల రాజుగా పరిగణించే సూర్య భగవానుడు మే 25వ తేదీ సోమవారం నాడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. జూన్ 8వ తేదీ వరకు సూర్యుడు ఇదే నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ పక్షం రోజుల పాటు ఎండలు మునుపెన్నడూ లేని విధంగా భగభగమండనున్నాయి.

**-'రోహిణి కార్తె వస్తే రోళ్లు పగులుతాయా?'**

వేసవి కాలంలో వచ్చే ఎండలు ఒక ఎత్తు అయితే, రోహిణి కార్తెలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు మరో ఎత్తు. ఈ సమయంలో సూర్యుడి కిరణాలు నేరుగా భూమిపై పడటం వల్ల ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుంది. అందుకే మండే ఎండల తీవ్రతను తెలపడానికి పెద్దలు "రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి" అనే సామెతను వాడుకలోకి తెచ్చారు.

**-వ్యవసాయ పంచాంగం - ఏరువాక ప్రారంభం:**

సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ నక్షత్రం పేరుతో కార్తెగా పిలుస్తారు. ఏడాదికి మొత్తం 27 కార్తెలు ఉంటాయి. రోహిణి కార్తె ముగియగానే జూన్ 9 నుండి మృగశిర కార్తె ప్రారంభమవుతుంది. ఈ సమయంలోనే తొలకరి జల్లులు కురుస్తాయి. దీనిని బేస్ చేసుకుని రైతులు తమ పొలాల్లో 'ఏరువాక' పనులను ముమ్మరం చేస్తారు.

**-రోహిణి కార్తెలో చేయకూడని పనులు ఇవే:**

ఈ పక్షం రోజుల పాటు సూర్యుడి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల పెద్దలు కొన్ని నియమాలను సూచించారు: శుభకార్యాలు వద్దు: రోహిణి కార్తె సమయంలో ఎలాంటి శుభకార్యాలు లేదా కొత్త పనులు ప్రారంభించకపోవడం మంచిది. ఆహార నియమాలు: శరీరంలో వేడి పెరగకుండా ఉండేందుకు మాంసాహారానికి దూరంగా ఉంటూ, సాత్విక ఆహారం, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రయాణాలు వాయిదా: ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సుదూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. ఈ కాలంలో సూర్యోదయం కంటే ముందే నిద్రలేచి సూర్య నమస్కారాలు చేయడం మరియు శక్తి మేరకు దానధర్మాలు చేయడం వల్ల శు భ ఫలితాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

# పెగడపల్లి ఘటన దళిత సమాజ ఆత్మగౌరవంపై దాడి

**-ఎం హెచ్ డి మండల ప్రధాన కార్యదర్శి కూడెల్లి భరత్ కుమార్**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 22






పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల జాతర సందర్భంగా దళితులపై జరిగిన అమానవీయ ఘటనను మాదిగ హక్కుల దండోరా మండల ప్రధాన కార్యదర్శి కూడెల్లి భరత్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మొక్కు చెల్లించేందుకు బోనాలతో వెళ్లిన దళిత మహిళలను గుడిలోకి అనుమతి ంచకుండా సుమారు ఆరు గంటల పాటు నిలబెట్టి కులం పేరుతో అవమానించడం దారుణమన్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజాన్ని కలిచివేసిందని తెలిపారు బాధితులు రోడ్డుపై బోనాలతో బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు స్పందించి 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు అయితే కేసులు నమోదు చేయడమే కాకుండా నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను మాదిగ హక్కుల దండోరా ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని హెచ్చరించారు రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మాదిగ హక్కుల దండోరా బృందం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడం జరిగిందన్నారు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కూడెల్లి భరత్ కుమార్ డిమాండ్ చేశారు.

# కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలి

**-వీసీకి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 22, తెలంగాణ పత్రిక



కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశించారు. కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రాజేందర్ రెడ్డి, కె.ఎస్.బి. కుమారి, ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, జిల్లా ఖజానా శాఖ అధికారి నవీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం





-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీషబ్బీర్

కామారెడ్డి, మే 22, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్‌లో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, తోట లక్ష్మి కాంతారావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ,కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా తీసుకొని పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా చేరే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కేవలం సమీక్ష సమావేశాలకు పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాల్లో కనిపించే మార్పుగా మారాలని అన్నారు. ప్రతి శాఖకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించిందని, వాటి అమలులో వేగం పెంచాలని సూచించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి వ్యక్తికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, తాగునీరు, రోడ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో జిల్లా స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఉండాలని, సమయపాలనతో పనులు పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ గిరి, డీఎస్పీ మధుసూదన్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు లక్ష్మి, పాత రాజు, పట్టణ అధ్యక్షులు సందీప్, కౌన్సిలర్లు అంజాద్, వాజీద్, మజీద్, కాళ్ళ గణేష్, గడ్డమీది మహేష్, లడ్డు, సత్యం, షేరు, జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొనె శ్రీనివాస్, సుదర్శన్, మండల అధ్యక్షులు రాజగోడ్, శ్రీనివాస్, నౌసిలాల్, కృష్ణ రావు, మాజీ మండల అధ్యక్షులు సుతారి రమేష్, అనంత్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, యాదవ రెడ్డి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐకెపి కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి ప్రతినిధి మే 22( తెలంగాణ పత్రిక):-

మార్కెట్ కు వచ్చిన ధాన్యము రోజుల తరబడి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు నల్లగొండ జిల్లావేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని ఐకెపి కేంద్రాన్ని సందర్శించారు. ఐకెపి కేంద్రంలో కుప్పలు కుప్పలుగా ఉన్న దాన్యపురాసులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలల నుండి ధాన్యం వస్తున్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, దీనికి గోనె సంచులు,లారీలు, గోదాములు అందుబాటులో లేవని కారణం చూపుతున్నారని ఇది సరైనది కాదని అదేవిధంగా వచ్చిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని ధాన్యాన్ని కొనలేమని తిరిగి తీసుకొని వెళ్లాలని రైతులకు అధికారులు చెబుతున్నారని ఇది సరైన విధానం కాదని అన్నారు ఐకెపి కేంద్రాల వద్దకు వచ్చిన ధాన్యం వానకు తడిసి ఎండకు ఎండి రైతులు నానా ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు. తెచ్చిన ధాన్యం రంగు మారిందని తాము కొనుగోలు చేయలేమని చెప్పడం రైతును నట్టేట ముంచటమేనని విమర్శించారు. తమది రైతు అనుకూలమైన ప్రభుత్వం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పటం వరకు మాత్రమే పరిమితమైందని ఆచరణలో అమలు చేయడం లేదని వారు విమర్శించారు. దేశానికి వెన్నుముకైనా రైతన్నను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని వారు కోరారు. వానాకాలం సాగు ప్రణాళిక ప్రకటించడంతోపాటు యూరియా పై ప్రవేశపెట్టిన యాప్ ను రద్దు చేయాలని వారు కోరారు.రైతులను దివాలా తీసే విధానాలకు కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని అందులో భాగంగా ఎరువుల ధరలను పెంచారని వారు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే యురియా పై యాప్ ను ప్రవేశపెట్టి రైతాంగాన్ని ఇబ్బంది పరుస్తుందని ఇలాంటి రైతు వ్యతిరేక విధానం పాల్పడితే తాము పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వాన కాలపు సీజన్ ప్రారంభమవుతుందని అందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని డి ఏ పి, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని అదేవిధంగా నాసిరకం విత్తనాలు మార్కెట్లోకి రాకుండా ప్రభుత్వం



కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మే 24 వ తేదీన రోహిణి కార్తీ ప్రవేశించడం ఆ తర్వాత రాష్ట్రంలోకి ఋతుపవనాలు ప్రవేశించి వానలు పడే అవకాశం ఉందని వార్తలు తెలిపారు. . రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం బ్యాంకు లావాదేవీలు 40% వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వాలని నిబంధన ఉందన్నారు. ఇట్టి నిబంధనను అమలు చేయకపోవడం విచారకరమైన విషయం అని అన్నారు. వారితో పాటుగా సిపిఎం నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి మాజీ మండలాధ్యక్షులు చింతకుంట్ల రాములు గ్రామానికి చెందిన రైతులు మెరుగు ప్రవీణ్ కుమార్ . కో ల వీరస్వామి మెరుగు యాబేతు కోలా శీను కోలా గోపి కట్ల శీను తదితరులు ఉన్నారు.

# రైతు ఆత్మహత్య రాజకీయలకు వాడుకోవద్దు

-బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందం ్ రెడ్డిఖబర్దార్

-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హలవత్ మోహన్ నాయక్ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు రాజిరెడ్డి

మెదక్ జిల్లా (తెలంగాణ పత్రిక) మే 22,

ధాన్యం కొనుగోలు విషయంలో రైతు రాజయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని బీ ఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించడం ఆత్మహత్య అవాస్తమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హలవత్ మోహన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్న శంకరం పేట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు మోహన్ నాయక్ అధ్యక్షతన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాయంత్రి రాజయ్య అనే రైతు తన కుటుంబంలోని కలహాల కారణంగా ఆత్మహత్యకి పాల్పడినట్లు తెలిసిందని ఇందులో ధాన్యం కొనుగోలు చేయకపోవడం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు అన్నది అవాస్తమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలు ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. సుమారు రెండు లక్షల 11 వేల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. రైతు ఖాతలో రూ 311 కోట్లను 28, 521 మంది రైతులకు నేరుగా జమ చేయడం జరిగిందని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలల సీరియల్ విధానంలోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని ధాన్యం రవాణా మిల్లులో కేటాయింపు అన్లోడింగ్ ప్రక్రియలు పరిస్థితులకు అనుగుణంగా సమన్వయం చేస్తూ నిర్వహించ బడతాయన్నారు. లేనిపోని అపోలో సృష్టిస్తూ రైతుల గందరగోలానికి దారితీస్తూ శవ రాజకీయాలకు మాజీ ఎమ్మెల్యే ప్రేరేపిస్తుందని ఆరోపించారు. రైతులు దిగులు పడకుండా కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని అంత ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని ఇదివరకు ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా శవ రాజకీయాలు చేస్తూ అనవసరమైన రాజకీయాలకు పోతే తగిన బుద్ధి చెపుతారని తీవ్రంగా హెచ్చరించారు చిన్న శంకరం పేటలో ఇద్దరు బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు దొంగలు ఉన్నారని వారి తీరు ఇకనైనా మారకపోతే తన్ని తరిమేస్తారని



తీవ్రంగా హెచ్చరించారు అగ్రహారం గ్రామానికి చెందిన రైతు రాజయ్య ధాన్యం కొనుగోలు కేంద్రం అలసత్వంతో చనిపోలేదని బీఆర్ఎస్ నాయకులు తెలుసుకొని మాట్లాడడం నేర్చుకోవాలని ఏది పడితే అది మాట్లాడితే ఖబర్దార్ అని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, నాయకులు మాజీ సర్పంచ్ రాజి రెడ్డి, సర్పంచులు గోపాల్ రెడ్డి, పుల్లారావు, యాదవరావు నాయిని ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## అగ్ని ప్రమాద బాధిత రైతులను ఆదుకోవాలి



ఇల్లంతకుంట మే 22 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన రైతుల వరి పంటలు, వరి కుప్పలు, బోరు సామగ్రి అగ్నికి ఆహుతై తీవ్రంగా నష్టపోయామని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, వ్యవసాయాధికారి ప్రవీణ్‌ను కలిసి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.అగ్ని ప్రమాదంలో కైరి పరుశురాం వరి పంటతో పాటు బోరు మోటారు, విద్యుత్ వైర్లు దగ్ధమయ్యాయి. దారవేణి దేవయ్యకు చెందిన వరి కుప్ప, గడ్డి, దారవేణి ఎల్లయ్యకు చెందిన రెండు వరి కుప్పలు కాలిపోయాయి. దారవేణి శ్రీనుకు చెందిన బోరు స్టార్టర్లు, వొల్లాల మల్లయ్యకు చెందిన బోరు పైపులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఆరు నెలలుగా శ్రమించి పండించిన పంటలు క్షణాల్లో బూడిద కావడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఊరిలో సర్పంచ్... గుడిలో పూజారి: తోలేం అనంతరావు



కొత్తగూడ మండల ప్రతినిధి:- మే 22. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, ఒక చేత్తో అమ్మవారికి హారతి పళ్లెం... మరో చేత్తో ఊరి ప్రగతి చక్రం. ఈ రెండు పాత్రలను అద్భుతంగా సమద్వికంగా పోషిస్తున్న సంఘటన.. వివరాల్లోకి వెళితే! మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, గుంజేడు సర్పంచ్ తోలేం అనంత రావు ఆయన కేవలం ఊరికి పెద్ద మనిషి మాత్రమే కాదు... అక్కడి ముసలమ్మ తల్లి ఆలయానికి పూజారి కూడా! గుంజేడు ముసలమ్మ తల్లి అంటే ఆ ప్రాంతానికి కొంగుబంగారం. తోలం వంశీయులు పూర్వకాలం నుంచే ఆ తల్లికి సేవ చేస్తున్నారు. తరతరాలు గా వస్తున్న ఆ భక్తిని అనంత రావు పూజారిగా కొనసాగిస్తున్నారు. ఉదయం లేస్తే పూజారిగా అమ్మవారి సేవలో తరించే ఆయన, ఆ తర్వాత సర్పంచ్‌గా మారి ఊరి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ... గుంజేడు గ్రామ ప్రజల మన్నలనుకూడా పొందుతున్నాడు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



తానూర్: 22మే (తెలంగాణ పత్రిక)

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు హజారేశంకర్ సూచించారు. ప్రజా పాలన ప్రతి ప్రణాళిక భాగంగా ఎల్విలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య బోధన, గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు.అలాగే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోషకులు, తదితరులు ఉన్నారు.

## పోతిరెడ్డిపల్లి గ్రామంలో తాడిచెట్లు దగ్ధం ఉపాధిని కోల్పోయిన గీత కార్మికుడు



వీణవంక ప్రతినిధి, మే 22( తెలంగాణ పత్రిక).

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి వ్యవసాయ పొలంలో కొయ్య కాల అంటి పెట్టి వెళ్లారు. ఆ మంటలు వ్యాపిస్తూ వృత్తినే దైవంగా జీవనం సాగించే ఉపాధిగా బతికే గీత కార్మికులు చేపూరి శ్రీకాంత్ గౌడ్ యొక్క కల్లువారే తాడి చెట్లు కాలి బూడిదవడంతో వృత్తినే జీవనోపాధిగా బతికే అతను తాడి చెట్లు కాలిపోవడంతో జీవన ఉపాధి కోల్పోయానని చెట్టును పట్టుకొని ఏడుస్తున్న చేపూరు శ్రీకాంత్ గౌడ్ నా ఉపాధి లేక నేడు తాడిచెట్లు కా లిపోయానని బాధతో కృంగిపోయాడు.ఇతనిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని తోటి గౌడస్తులు కోరారు..

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లో కాపర్ తీగల చోరీ



ముధోల్: 22మే(తెలంగాణ పత్రిక)

మండలంలోని విట్టోలి తండా, కారేగాం పెట్రోల్ బంక్ వద్ద గల వ్యవసాయ పంట పొలంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లో ఉన్న కాపర్ తీగలను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. బాధిత రైతు శుక్రవారం పంటపొలాలకు వెళ్ళగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కింది పడిపోయి కనిపించింది. దీంతో సమాచారాన్ని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ అందించగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లో గల కాపర్ తీగలను చోరీ గురైందని తెలుసుకున్నారు. క్లోజ్ టీమ్ బృందం తనిఖీలు చేసి వివరాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## బరిగేలగూడెం కాలనీలో బడిబాట కార్యక్రమం

-పాల్గొన్న సర్పంచ్ మల్లు గారి పద్మ



గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 22

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట బరిగేలగూడెం కాలనీలో శుక్రవారం రోజున ప్రజా ప్రణాళికలో భాగంగా బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ మల్లు గారి పద్మ స్థానిక వార్డ్ మెంబర్లు ఎగదండి అర్జున్ , నేతికుంట వరలక్ష్మి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల ఉపాధ్యాయులు బాలరాజు ఆశ వర్కర్ లత అంగన్వాడి టీచర్స్ మంజుల, లత స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ

-ప్రమాదాల నివారణకు ఎంతో ఉపయోగం: సీఐ శ్రీనివాస్



ఇల్లంతకుంట, మే 22 తెలంగాణ పత్రిక

గీత కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాస్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట గీత కార్మికులకు శుక్రవారం ఆయన కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాటి, ఈత చెట్లు ఎక్కే సమయంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కాటమయ్య రక్షణ కిట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కిట్లను ఏ విధంగా ఉపయోగించాలో కార్మికులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. కిట్లను సద్వినియోగం చేసుకొని ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రణీత్ గౌడ్, సంతోష్, కోమల, రమేష్, ప్రశాంత్, ఇల్లంతకుంట గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, రహీంఖాన్‌పేట గౌడ సంఘం అధ్యక్షుడు తిరుపతి గౌడ్, సంఘ సభ్యులు వెంకటేశం, అంతటి శ్రీనివాస్, ముంజ భాస్కర్ గౌడ్, కొయ్యడ చందు గౌడ్, పరుశురాం గౌడ్, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో కొట్టెం భద్రమ్మ మృతి

గూడూరు మండల ప్రతినిధి:- మే 22. (తెలంగాణ పత్రిక)



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని మచ్చర్ల గ్రామానికి చెందిన, కొట్టెం భద్రమ్మ అనే 60 సంవత్సరాల వృద్ధురాలు, నేడు ఎగిసిపడుతున్న ఎండలకు 43 నుండి 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక, వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందినట్లు, ఈమెకు వివాహాయితులైన ఒక కుమారుడు, కూతురు ఉన్నట్లు, మచ్చర్ల గ్రామ ప్రజలు తెలియజేశారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 22



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ138 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం ఉద్దేశించి జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం మాట్లాడుతూ భారతీయ సామాజిక సంస్కరణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేకించి దళిత ఆత్మగౌరవ విముక్తి పోరాటాలలో హైదరాబాద్ సంస్థానానికి ఒక విశిష్టమైన స్థానం ఉంది దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దళిత ఉద్యమం ఉధృతంగా సాగడానికి ముందే నిజాం నిరంకుశ రాజ్యాధికా పాలనలో మగ్గుతున్న దక్కన్ ప్రాంతంలో అణగారిన వర్గాల చైతన్యానికి వేగుచుక్కగా నిలిచిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అందించిన మేధోపరమైన వారసత్వాన్ని సామాజిక తాత్వికతను వర్తమాన సామాజిక రాజకీయ సంక్షోభాల నేపథ్యంలో పునార్మల్యంకనం చేసుకోవడానికి ఒక అమూల్యమైన అవకాశం కావాలి అని అన్నారు భాగ్యరెడ్డి వర్మ కేవలం ఒక సామాజిక కార్యకర్త మాత్రమే కాదు ఆయన ఒక గొప్ప పరిశోధకుడు పాత్రికేయుడు మరియు రచయిత జగన్మిత్ర మండలి 19శ6 మాన్య సంఘం 1911 తదుపరి ఆది ఇందు సోషల్ సర్వీస్ నీకు వంటి సంస్థలను స్థాపించి దళితులలో విద్యా విప్లవానికి సాంస్కృతిక పునర్జీవనానికి చిత్రలేఖనం సాహిత్య సృష్టి కుష్టిపట్టువంటి అనేక శరీరక మేధోపరమైన రంగాలలో వారిని ప్రోత్సహిస్తూ ఇతరులకు ఏమి తీసుకొని ఆత్మ స్థైర్యాన్ని నింపుతూ నంది పలికారు జ్ఞానమే విముక్తికి మార్గమని నమ్మినాయన దళితుల కోసం ప్రత్యేకంగా ఆది హిందూ గ్రంథాలయం ఏర్పాటు చేశారు ప్రచార సాధనంగా భాగ్య సాగర్ అనే పత్రికను స్థాపించి ఆ తర్వాత దానిని ఆది హిందూ పత్రికగా మార్చి తన ఉపన్యాసాలను వ్యాసాలను ప్రజలలోకి తీసుకెళ్లి 1934 ఖమ్మం ఆంధ్ర మహాసభ కాన్ఫరెన్స్లో ఆయన చేసిన ప్రసంగం ఒక మేధోపరమైన విస్ఫోటనం ఇందులో ఆయన అగ్రవర్ణాల ద్వంద్వ నీతిని ఎండగడుతూ ఇలా ప్రసంగించారు 1917లో విజయవాడలో జరిగిన ప్రథమ ఆంధ్రదేశ పంచమ సభకు అధ్యక్షత వహిస్తూ దశాబ్దాలుగా దళితులపై రుద్దపడిన పంచమా అనే పదం వేదాలలో గాని పురాణాల్లో గాని లేదని అది కేవలం అగ్రవర్ణాల స్వార్థపూరిత సృష్టి అని చరిత్రక శాస్త్రీయ ఆధారాలతో నిరూపించారు భాగ్యరెడ్డి వర్మ 138 కేవలం ఒక వార్షిక ఉత్సాహం కాకూడదు అది ఒక లోతైన సామాజిక ఆత్మ పరిశీలన సమయంగా మారాలి నేటి ప్రజాస్వామ్య యుగంలో మరింత శక్తివంతమైన ప్రేరణగా ఉపయోగపడాలని తెలుగు రాష్ట్రాల్లోని మాల సామాజిక వర్గం ఇతర దళిత సంఘాలు తమ అంతర్గత సమస్యను పరిష్కరించుకొని విభేదాలను వీడి భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను కొనసాగించాలని జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం మాల సమాజానికి తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎగదండి స్వామి జిల్లా నాయకులు నల్ల రాజ్ కుమార్ దోసల రాజు మద్దెల బాలరాజు నాందేడ్ మనోజ్ కుమార్ తుమ్మల శ్రీకాంత్ శ్రీలత అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

-ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, మే 22,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రైతులు లాభసాటి పంటలు పండించేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కామారెడ్డిజిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని పోచారం అన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది మొత్తం తినేది 40 లక్షల టన్నులు అయితే రాష్ట్రంలో అంతకంటే ఎక్కువ వరిధాన్యం పండుతుందన్నారు. వాటిని నిల్వ చేయడానికి గోదాములు సరిపోవడం లేదన్నారు. అందుకే అధికారులు పంట మార్పిడి కోసం రైతులను ప్రోత్సహించాలని, రైతు వేదికలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని పోచారం శ్రీనివాస్రెడ్డి అన్నారు. అయితే అనర్హులకు ఇళ్ల మంజూరు చేస్తున్నారని అక్కడక్కడా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ , జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ గిరి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అవశేషాల దహనంపై రైతులకు హెచ్చరిక

-కాల్చితే నష్టం.. నిర్వహిస్తే లాభం
-ఆరోగ్యానికి హాని -- నేల సారానికి నష్టం
-చట్టపరమైన చర్యల హెచ్చరిక

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) పున్నం సారయ్య



వ్యవసాయ అవశేషాలను పొలాల్లో కాల్చివేయకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. అవశేషాలను దహనం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు, నేల సార నష్టం, వాయు కాలుష్యం వంటి తీవ్ర ప్రభావాలు కలుగుతాయని తెలిపారు. అవశేషాల దహనం వల్ల వెలువడే పొగ కారణంగా శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, కంటి సమస్యలు పెరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే నేలలో ఉండే సూక్ష్మజీవులు నశించి, భూమి సారవంతత తగ్గిపోవడంతో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. అవశేషాల దహనం వలన వాయు కాలుష్యం పెరగడంతో పాటు రహదారులపై పొగమంచు ఏర్పడి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అవశేషాల దహనాన్ని నిషేధించిన నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. భూ సంబంధిత సబ్సిడీలు, పంట బీమా సదుపాయాలపై కూడా ప్రభావం పడవచ్చని తెలిపారు. రైతులు అవశేషాలను కాల్చివేయకుండా ట్రాక్టర్ రోటవేటర్ సహాయంతో నేలలో కలపడం, మల్చింగ్, స్ట్రా మేనేజ్‌మెంట్ యంత్రాలను వినియోగించడం, కంపోస్ట్, బయోగ్యాస్, పశువుల మేతగా ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచించారు. పచ్చి ఎరువులుగా వినియోగించడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. "అవశేషాలు కాల్చితే నష్టం -- నిర్వహిస్తే లాభం" అనే నినాదంతో రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూమిని, ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి రైతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు శ్రేయస్సే తమ లక్ష్యమని, రైతుల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని అనుమాండ్ల తిరుపతి రెడ్డి తెలిపారు.

# పదో తరగతి టాపర్లకు బహుమతులు.. నూతన కార్యవర్గానికి సన్మానం

ఇల్లంతకుంట, మే 22 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట మండల కేంద్రంలో అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండారి నర్సయ్య ఆధ్వర్యంలో రెండో ఇన్‌స్టాలేషన్, పీఎస్‌టీ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలయన్స్ ట్రస్టు జిల్లా చైర్మన్ డా. ఎలగందుల శ్రీనివాస్, జిల్లా పీఆర్వో పుల్లెల శ్యామ్, జిల్లా వైస్ గవర్నర్ విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా డొనేషన్ క్యాంపులు, హెల్త్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహించి అలయన్స్ క్లబ్ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లైఫ్ మెంబర్‌షిప్ తీసుకోవాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అలయన్స్ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, మాజీ అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆనంద్ శర్మ, కోశాధికారి బొంగిని సత్యం, పీఆర్వో మామిడి రాజేల్లం, మీడియా ఇన్‌చార్జి దయ్యాల సురేష్, సలహాదారులు పర్స ఐలయ్య, మొగిల్ల బాబు, కోహెడ భాస్కర్, కీసరి కనుకయ్య, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జి రేగుల కార్తీక్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఇన్‌చార్జి అంతటి తిరుపతి, గడ్డం రవి, మ్యాకల ఐలయ్య, జక్కుల రాజు, బండారి మాధవి, వివిధ గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అలయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలకు అణుగుణంగా కనీస వేతనాలు పెంచాలి

-పానుగంటి పర్వతాలు.

రాజేంద్రనగర్ ప్రతినిధి మే 22 తెలంగాణ పత్రిక.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో విలేకరుల సమావేశంలో కార్మిక శాఖ పరిధిలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాల పెంపుదలను ప్రకటించారు. సుమారు 14 సం॥ల తరువాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 2026 జూన్ 2 నుండి సవరించిన వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కల్గుతుందని తెలిపారు . ప్రకటించిన వేతనాలు పెరిగిన ధరలకు, అణుగుణంగా కార్మికులు, కార్మిక సంఘాల చేసిన డిమాండ్ను పట్టించుకోకపోవడం తీవ్ర అసంతృప్తిని కల్గిస్తుందని . ముఖ్యమంత్రి వేతనాల పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని, దేశానికే ఆదర్శవంతంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని ప్రకటించారని, ఆచరణలో చూస్తే ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనాల పెంపుదలలో శాస్త్రీయత లోపించిందని ఆశాస్త్రీయమైన పద్ధతిలో వేతానాలను ప్రకటించారని పెరిగి ధరలకు కనీస వేతనాలు పెంచాలని ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేశారు. కనీస వేతనాలను రాష్ట్రంలో 3 జోన్స్లుగా విభజించారు. మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాలుగా విభజించి వేతనాలు వేరువేరుగా ప్రకటించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. అలాగే వేతనాలను 4 క్యాటగిరీలు విభజించి అన్ని రంగాలలో ఒకేరితిలో వేతనాలు పెంచడం వల్ల గతంలో ఎంప్లాయిమెంట్స్ వివిధ రకాల పనులకు వివిధ రకాలుగా ఉన్న పద్ధతి లేకుండాపోతుంది. దీని వల్ల నష్టం జరుగుతుందన్నారు . కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువుభత్యం గురించి ప్రస్తావించక పోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పెరిగిన వేతనాలు కూడా 4 క్యాటగిరీలో అన్స్కిల్డ్ వర్కర్కు రూ. 16,000/-, సెమిస్కిల్డ్ వర్కర్కు రూ. 17,000/-, స్కిల్డ్ వర్కర్కు రూ. 18,500/-, హైస్కిల్డ్ వర్కర్కు రూ. 20,000/-లు పెంచినట్లుగా ముఖ్యమంత్రి ప్రకటించగా ఇందులో ఒక్క అన్స్కల్డ్ వర??కర్కు తప్ప మిగితా వారికి బేసిక్ కరువుభత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి పెరిగిన దానికి పెద్ద తేడా లేదన్నారు . అవి కూడా జూన్1 కార్పొరేషన్లను ప్రకటించినట్లుగా చెబుతున్నారని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇంకా తగ్గే పరిస్థితి ఉందని అన్నారు. కాంట్రాక్టు లేబర్ జీవోనెం 11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో రూ. 13,098 నుండి 23683 వరకు వేతనాలు పొందుతున్నారని మరి ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమి లేదని ప్రస్తుతం అమలులో ఉన్న జీవో నెం 4 తో పోలిస్తే కూడా కొన్ని క్యాటగిరీలలో స్వల్ప పెరుగుదలగాను, కొన్ని క్యాటగిరీలో ప్రస్తుతం పొందుతున్న వేతనం కంటే తగ్గిందన్నారు . జీవో నెం 4లో స్కిల్డ్ కార్మికుడికి వేతనం రూ. 19,572/-లు వుండగా ముఖ్యమంత్రి ప్రకటించిన వేతనం రూ. 18,500/-లు మాత్రమే. గతంతో పోలిస్తే రూ. 1072/- లు తగ్గిందన్నారు .దీంతో పాటు బిఆర్ఎస్ అధికారంలో వుండగా కనీస వేతనాల సలహామండలి బోర్డు అన్స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం రూ. 18,009/-లు, కరువుభత్యాన్ని ఒకొక్క ఫాయింటికి రూ. 12/-లు సిపార్సులు చేశారు. దీంతో పాటు 2021 జూన్ 25న అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 5 జీవోలను జారీ చేసింది. వాటికి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేయలేదన్నారు . ఇప్పటి వరకు అనుసరించాల్సిన ఏ ప్రామాణీకాన్ని కూడా




పరిగణలోకి తీసుకోలేదని,. కార్మిక సంఘాలు, కనీస వేతనాల సలహామండలి సిపార్సులను పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించారన్నారు . ప్రభుత్వం కనీస వేతనం రూ. 26,000/-లుగా నిర్ణయించాలని పర్వతాలు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలు, 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ అక్రాడ్ ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని . శాస్త్రీయంగా లెక్కిస్తే రూ. 32,000/-లు వస్తుందన్నారు . కార్మిక సంఘాలు కనీస వేతనం రూ. 26 వేలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణలోకి తీసుకొని ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు.

# ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ సమ్మేళనం

-31 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

-విద్యార్థుల్లో ఏమాత్రం తగ్గని జోష్

తెలంగాణ పత్రిక,చందుర్తి,మే 22.

జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల చందుర్తి మండల కేంద్రంలో 1994 - 95వ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని 31 సంవత్సరాల తర్వాత శుక్రవారం రోజు చందుర్తి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఏమాత్రం జోష్ తగ్గకుండా పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ , అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమ దైనది కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాల నుండి కార్యక్రమానికి తరలివచ్చి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. డాన్స్ చేస్తూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత , హాజరైన ఉపాధ్యాయులకు మరియు పూర్వ విద్యార్థులకు జ్ఞాపిక అందించి శాలువాతో ప్రతి ఒక్కరిని సత్కరించారు. పూర్వ విద్యార్థి అయిన మార్త మల్లేశం కేవలం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరు కావడానికి సౌదీ అరేబియా



నుండి రావడం కార్యక్రమానికె త ళామాణికం. కార్యక్రమానికి హాజరైన అలనాటి ఉపాధ్యాయులు బండ లింగారెడ్డి , పి. సుధాకర్ , సిహెచ్ ప్రభాకర్ , ఐ ప్రభాకర్ లు తమ అమూల్యమైన సందేశాన్ని పూర్వ విద్యార్థులకు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. జీవితం ప్రశాంతంగా ఉండాలి అంటే దైవ భక్తితోనే సాధ్యం అని ఉపాధ్యాయులు లింగారెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ, కేవలం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకొని మరిచిపోకుండా ఇదే ఐకమత్యాన్ని జీవితాంతం కొనసాగించాలని. స్నేహ బంధాన్ని మించిన బంధం ప్రపంచంలో మరేది లేదని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకొని మరిచిపోకుండా జీవితాంతం ఇలాగే ఐకమత్యంగా ఉండాలని, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలు పంచుకోవాలని తమ స్నేహితులకు అండగా నిలవాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి కట్కూరి ముఖేష్ మాట్లాడుతూ కార్యక్రమ విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యంగా ముందుండి నడిపించిన బండ శంకర్, నేరెళ్ల బాబు, మల్యాల దేవరాజు, మ్యాకల కొమురయ్య, గుర్రం మధు, నయీమ్ పాషా లకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# లింగన్నపేటలో సత్యనారాయణ స్వామి పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్





గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 22

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన రాధాకృష్ణ పంతులు నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం పలికి పూజా కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు పూజ అనంతరం స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

-కనీస వేతనాల పెంపుపై సంబరాలు

చేగుంట. మే 22 ( తెలంగాణ పత్రిక)



నిన్నటి రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు శుభవార్త తెలియజేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు ఎ.రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనం రూ. 20,000గా నిర్ణయించినట్లు, కార్మిక శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు చేగుంట గాంధీ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారిక,దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారికి పాలాభిషేకం నిర్వహించిన చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ గౌరవ సర్పంచ్ లు సంద్రుగు స్రవంతి సతీష్, శ్రీనివాస్ రెడ్డి,మాధవ్ రెడ్డి,భిక్య నాయక్, మహేశ్వరి సాయిబాబు, వివిధ గ్రామ ఉపసర్పంచ్ ఎండీ .రఫీ,చౌదరి శ్రీనివాస్, బొల్ల ప్రశాంత్, నాగేష్ గుప్తా,ఎఎంసి డైరెక్టర్లు బాల్ రెడ్డి,కురుమ లక్ష్మి,మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కశబోయిన మహేష్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,ఉపాధ్యక్షులు మద్దూరి రాజు,సీనియర్ నాయకులు పూర్ర ఆగం, మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు రాకేష్,బిక్షపతి, నాగులు, నర్సింహ రెడ్డి,బాధ్య నాయక్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ విషయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నీ సూటిగా ప్రశ్నించిన చేగుంట మండల



## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్

చేగుంట .మే .22 . (తెలంగాణ పత్రిక )

చేగుంట మండలం లో ఎన్ని ఐకెపి సెంటర్ లు ఉన్నాయో తెలియదు ఇప్పటి వరకు ఎంత శాతం ధాన్యం కొనుగోలు చేశారో తెలియదు ఎమ్మెల్యే బి.కొండాపూర్ గ్రామంలో వచ్చి ఇప్పటి వరకు 5 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారు అని తప్పుడు విషయాలు మాట్లాడం జరిగింది. కానీ చేగుంట మండలంలో మొత్తం 26 ధన్య సేకరణ కేంద్రం లు ఏర్పాటు చేసి ఈ రోజు కి 63 శాతం 1.36 క్వింటాలు వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. కానీ నువ్వు ఈ ప్రాంత ఎమ్మెల్యే వి నీకు ఇక్కడి రైతుకు ఓట్లు వేసి గెలిపించారు కానీ మీరు ధన్య సేకరణ విషయంలో రైతులకు అండగా ఉండకుండా రవాణా విషయంలో రైతులకు అండగా ఉండకుండా అలగే నీ యొక్క సోనీ ట్రాన్స్పోర్ట్ ద్వారా వారితో మాట్లాడి లారీల ను కేటాయించకుండా నిర్లక్ష్యం చేసి ప్రభుత్వం మీద బురద రాజకీయం చేస్తున్నావు రైతులు,ప్రజలు,గమనిస్తున్నారు వచ్చే ఎన్నికలో నీకు ఈ ప్రాంత ప్రజలు గోరి కడతారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం....జై కాంగ్రెస్ ఈ సందర్భంగా వివిధ గ్రామ గౌరవ సర్పంచ్ లు సంద్రుగు స్రవంతి సతీష్, శ్రీనివాస్ రెడ్డి,మాధవ్ రెడ్డి,భిక్య నాయక్, మహేశ్వరి సాయిబాబు, వివిధ గ్రామ ఉపసర్పంచ్. ఎండీ .రఫీ,చౌదరి శ్రీనివాస్, బొల్ల ప్రశాంత్, నాగేష్ గుప్తా,ఎఎంసి డైరెక్టర్లు బాల్ రెడ్డి,కురుమ లక్ష్మి,మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కశబోయిన మహేష్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,ఉపాధ్యక్షులు మద్దూరి రాజు,సీనియర్ నాయకులు పూర్ర ఆగం, మాజీ సర్పంచ్ జగన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు రాకేష్,బిక్షపతి, నాగులు, నర్సింహ రెడ్డి,బాధ్య నాయక్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



## వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ

మే 22 ఖమ్మం తెలంగాణ పత్రిక

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ అన్నారు. మన మున్సిపాలిటీని మరింత సుందరంగా సకల సౌకర్యాలతో విరాజిల్లాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు, ప్రజా ప్రభుత్వంలో ప్రస్తుతం మీరు కట్టే ప్రతి పైసా అత్యంత పారదర్శకంగా మన మున్సిపాలిటీ పార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం, మీరు కట్టే హౌస్ టాక్స్ ఇతర పన్నులతోనే పారిశుద్ధ విప్లవం నిరంతరం డ్రైనేజీల క్లీనింగ్ తడి పొడి చెత్త సేకరణ తాగునీటి సరఫరా స్ట్రీట్ లైట్స్ ఇతర ఇతర కార్యక్రమాలకు మీరు చెల్లించే పనులే ఆధారం, పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలనిఆమె కోరారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

-మధిర ఏడీఏ ఎస్.విజయ చంద్ర, రూలర్ సీఐ మధు

మే 22 ఖమ్మం తెలంగాణ పత్రిక



మధిర మండలంలోని విత్తన దుకాణాలు, ట్రాన్స్పోర్ట్ ఆఫీసులో సీడ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది అయినా మధిర ఏ డి ఏ ఎస్. విజయ చంద్ర , రూలర్ సీఐ మధు తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ సమీపిస్తున్న సందర్భంగా వచ్చినటువంటి విత్తనాలు వాటికి సంబంధించిన ఇన్వాయిసులు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు మరియు స్టాక్ రిజిస్టర్స్ తనిఖీ చేశారు. విత్తనం అమ్మే డీలర్లు కచ్చితంగా ఇన్వాయిస్లు పిసిలు కలిగి ఉండాలని మరియు స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా సరియైన డాక్యుమెంట్స్ లేకుండా విత్తనాలమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. అందరూ విత్తన చట్టం 1966 లోబడి విత్తనాల అమ్మాలని సూచించారు. స్టాక్ బోర్డ్ తప్పనిసరిగా తెలుగులోనే రాయాలని సూచించారు. హెచ్ టి కాటన్ న నిషేధించబడినదని ఎవరైనా అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ గ్రామాలలో రాత్రిపూట ఎవరైనా అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారికి మరియు పోలీసు శాఖకు ఫిర్యాదు చేయాలని డీలర్లకు సూచించారు. తదనంతరం ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీస్ అయినా నవత మరియు క్రాంతి ఆఫీసుల్లో కూడా తనిఖీలు నిర్వహించి వారికి కూడా లూస్ గా వచ్చే విత్తనాల మీద ఎటువంటి సమాచారం వచ్చినా వెంటనే మండల వ్యవసాయ అధికారి కానీ దగ్గర్లో ఉన్న పోలీస్ వారికి కానీ సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ పాల్గొన్నారు.

## భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జనగణన కీలకం

-సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ బషిరొద్దిన్.

మే 22 కరీంనగర్ తెలంగాణ పత్రిక




భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు జన గణన కీలకమని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ బషిరొద్దిన్ సూపర్ వైజర్లను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందింలో శుక్రవారం జన గణన సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం జరిగింది.నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న మొదటి దశ (హౌజ్ లిస్టింగ్) జన గణన ప్రక్రియ విధానం, క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు వివరాల సేకరిస్తున్న తీరు తదితర విషయాలను సూపర్ వైజర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనగణన పైపలు సూచనలు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని హౌజ్ లిస్టు బ్లాక్ ల వారిగా ప్రతి ఇంటినీ సర్వే చేయాలన్నారు. మొదటి దశ గణనలో హౌజ్ నంబరింగ్, నివాస గృహాల వివరాల సేకరణ అత్యంత కీలకమని సూచించారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల పరిధిలో ప్రతి ఇంటినీ సందర్శించి, ఖచ్చితమైన వివరాలను సేకరించేలా సూపర్ వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడా ఏ ఒక్క ఇల్లు తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్లకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక లేదా ఇతర సమస్యలను సూపర్ వైజర్లు తక్షణమే పరిష్కరిస్తూ, ప్రక్రియ వేగవంతంగా సాగేలా చూడాలన్నారు. ప్రజల జీవన స్థితిగతులు, గృహాల వసతుల సమాచారాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్ ప్రకారం పక్కాగా నమోదు చేసేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు దాదాపు 35% జన గణన ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. జూన్ 9 లోపు పూర్తి చేసేలా సూపర్ వైజర్లు చర్యలు తీసుకోవాలని... సంబంధిత అంశాన్ని ఎన్యూమరేటర్లకు సూచించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ గణాంకాలే ప్రాతిపదిక అని, అందువల్ల నగర ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు సహకరించి ఖచ్చితమైన వివరాలు అందించి విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ సెన్సస్ ఆఫీసర్ ఖాధర్ మొహియుద్దీన్, అదనపు చార్జ్ ఆఫీసర్లు వేణు, శ్రీధర్, జన గణన మాస్టర్ ట్రైనర్లు, సూపర్ వైజర్లు, పాల్గొన్నారు.

# ఆర్పీల కమిషన్ దందాపై ప్రశ్నించినందుకు బెదిరింపులు

మే 22 జగిత్యాల జిల్లా ప్రతినిధి



జగిత్యాల: మహిళా సంఘాల రుణాల పంపిణీలో ఆర్పీలు అక్రమంగా కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ప్రశ్నించినందుకు బెదిరింపులు ఎదురైనట్లు తెలంగాణ పత్రిక స్టేట్ ఇన్‌చార్జ్ తెలిపారు.మహిళా సంఘాల సభ్యుల నుంచి 50 వేల రుణానికి 500 నుండి 1000 రూపాయల కమిషన్ రూ.1 లక్ష రుణానికి రూ.1,500, కమిషన్ రూ2.000.00 రుణానికి 2000 చొప్పున కమిషన్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వార్తలు ప్రచురించిన నేపథ్యంలో టి ఆర్ నగర్ ఆర్పీ భర్త.. చంద్రమౌళి.. డిపో ముంగట అడ్డగించి మా భార్య ని ఇష్టం వచ్చినట్లు మాట్లాడావని దుర్భాషలాడుతూ బెదిరించి నట్లు ఆరోపించారు.ఈ ఘటనపై రేపు సంబంధిత. పై పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్పీల కమిషన్ దందాకు సంబంధించిన పూర్తి ఆధారాలు, బాధితుల వివరాలతో సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించనున్నట్లు వెల్లడించారు.ఈ అంశాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు కనిపించలేదని, అందువల్ల పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేసి సమగ్ర విచారణ కోరనున్నట్లు తెలిపారు. గతంలో కూడా టిఆర్ నగర్ ఆర్పి మీద ఫిర్యాదులు ఇచ్చామని సద వ్యక్తులు తెలపడం జరిగింది. మహిళా సంఘాల పేరుతో కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే జర్నలిస్టులను బెదిరించిన ఘటన పై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# బడుగు బలహీన వర్గాల ప్రజల గుండెల్లో

## చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రాంరెడ్డి వెంకటరెడ్డి



-83వ జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు..

మే 22 ఖమ్మం తెలంగాణ పత్రిక

పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజా హృదయ నేత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నాయకుడు రాంరెడ్డి వెంకటరెడ్డి అని, వారిని కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు రాంరెడ్డి 83వ జయంతి సందర్భంగా లింగాల క్రాస్ రోడ్ లోని రాం రెడ్డి వెంకట రెడ్డి విగ్రహానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, డి సి సి బి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్ టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, తోటకూరి శివయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అరెం రవి తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది రాజకీయ నాయకులు ఈ ప్రాంతంలో కీర్తిశేషులు అయినప్పటికీ వారి పేరు మాత్రం కొంతకాలం మాత్రమే తలుచుకుంటున్నామని, కానీ రాంరెడ్డి అంటే ఒక బ్రాండ్ లాగా ఎవరికి ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్న మహనీయుడు మన రాంరెడ్డి వెంకటరెడ్డి అని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోవాలంటే పదిమందికి ఉపయోగపడే మంచి పని చేయాల్సి ఉంటుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పదవిని అనుభవించి కూడా సామాన్యమైన జీవితం గడిపిన వ్యక్తి, నిస్వార్ధ రాజకీయంతో ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా వారిని ఆదర్శంగా తీసుకుని యువత బాధ్యతతో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇమ్మడి రామనాథం, రాయల లక్ష్మయ్య, గ్రామ సర్పంచులు జి



రెడ్యా జి భాషా, ఉప సర్పంచులు మేకల మల్లికార్జునరావు కొమ్మినేని శ్రీనివాసరావు, యడ్లపల్లి బాబు, ఆర్. కోటేశ్వరరావు, సుమన్ కోటి, అంబడిపూడి సత్యం, మొగిలి శ్రీను, చల్ల మల్లయ్య పాటిబండ్ల ప్రసాద్ , బాదావత్ నాగరాజు, ఐతన బోయిన విట్టల్ రావు, ఉప్పుగండ్ల భద్ర రావు, దుద్దుకూరు నాగేశ్వరరావు పోట్ల శ్రీకాంత్, ఏపూరి మల్లయ్య సింగం వెంకన్న మాజీ ఎంపీపీ రాందాస్, బానోతులాల, పుచ్చకాయల అప్పారావు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు సొసైటీ డైరెక్టర్లు పాలకవర్గ సభ్యులు, రాంరెడ్డి వెంకట రెడ్డి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందించడమే లక్ష్యం

-అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
-జిల్లాలో సమర్థవంతంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక
-కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

మే 22 కరీంనగర్ ప్రతినిధితెలంగాణ పత్రిక

ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమర్థవంతంగా జరిగిందని, క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సభ శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా 10 అంశాలతో ఈ కార్యక్రమందిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రతి గ్రామం పర్యటించి ప్రజలతో మమేకమయ్యారని, వారి సమస్యలు తెలుసు కున్నారని, అవసరాలను గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శిక్షణ, సంక్షేమం, అవగాహన సదస్సులు వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకున్నారని, వాటి పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని వివరించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు, ప్రజా అవసరాలను గుర్తించామని తెలిపారు. ప్రతి చివరి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు చేరేవరకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. గ్రామస్థాయిలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం అభివృద్ధిని ప్రోత్సహించాలని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడం చైతన్య పరచడం, భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి కార్యక్రమాల దృశ్య ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అధికారులు ప్రజలతో మమేకమై అనేక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించారని అన్నారు. మరిన్ని పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటారని తెలిపారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించామని అన్నారు. సుమారు 1500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ 66 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం ద్వారా సానిటేషన్ ని మెరుగుపరిచామని తెలిపారు. రానున్న రోజుల్లో కొత్తగా నగరంలో కలిసిన పరిసర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెడతామని అన్నారు.సమావేశంలో డిప్యూటీ మేయర్



సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు." సర్పంచుల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్" గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఈ హెల్ప్ డేస్క్ నిర్వహణ కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కేటాయించి సర్పంచులకు తెలియ జేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. వాటిని పూర్తి చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల జమా ఖర్చులను పర్యవేక్షించాలని, తద్వారా సిబ్బంది వేతనాలు, గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు వంటివి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143